శనివారం
10-06-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 348
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఉక్రెయిన్‌కు చివరి వరకు తోడుంటాం

రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు తోడ్పాటు అందిస్తామని, చివరి వరకు వెన్నుదన్నుగా నిలుస్తామని, ఆర్థికంగానే కాకుండా ఇతర సహాయ సహకారాలు అందిస్తామని అమెరికా, బ్రిటన్ దేశాధినేతలు జో బైడెన్, రిషి సునాక్ సంకల్పించారు.

2లో

దేశంలో పాల సంక్షోభం

పడిపోయిన ఉత్పత్తి - దిగుమతులే ఆధారం
పెరిగిన డెయిరీ రైతుల కష్టాలు
అందుబాటులో లేని పశుగ్రాసం ధర

న్యూఢిల్లీ: దేశంలో పాల సంక్షోభం ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరుకుంది. నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగిపోయాయి. సామాన్య ప్రజలపై భారం పెరిగిపోయింది. మరోవైపు డెయిరీ రైతుల కష్టాలు మరింత పెరిగాయి. ఇప్పటికే పశు గ్రాసం ధర పెరిగి డెయిరీ రంగం ప్రభావితమవుతోంది. కోవిడ్ మహమ్మారి కూడా డెయిరీ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తిదారు దేశంగా ఉన్న భారత్ ప్రస్తుతం దిగుమతులపై ఆధారపడుతోంది. ఇతర దేశాల నుంచి పాలు, పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. క్షీర ఉద్యమానికి 50ఏళ్లు అయ్యే నాటికి భారతదేశం పాల సంక్షోభం అంచునకు చేరుకుంది. డిమాండును తీర్చలేని పరిస్థితికి వచ్చింది. రైతు ఆదాయాన్ని పెంచాలంటే పాడి పరిశ్రమ కీలకం కాగా డెయిరీ రంగానికి సరఫరా-డిమాండ్ మధ్య సమతుల్యత చాలా ముఖ్యం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాధారంగా ఉండే డెయిరీ రంగంలో సంక్షోభం వల్ల పరిణామాలు

- మిగతా 2 లో

డీఎస్సీపై ఊగిసలాట

ప్రకటన చేయడంలో జాప్యం
కేబినెట్‌కి రాని దస్త్రం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ నియామకాల (డీఎస్సీ)పై రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం ఇంకా ఊగిసలాడుతోంది. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇటీవల త్వరలో డీఎస్సీ ఉంటుందని నిరుద్యోగులను ఊరించేలా మాట్లాడారు. అది కేబినెట్‌కి వచ్చి ఆమోదం పొందుతుందని లక్షలాదిమంది అభ్యర్థులు ఆశించారు. తీరా కేబినెట్‌లో డీఎస్సీ ప్రస్తావనే లేకపోవడంతో నిరుద్యోగ ఉపాధ్యాయ యువత మరోసారి భంగ పాటుకు

- మిగతా 2 లో

ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములే

60 రోజుల్లో మంత్రివర్గ నిర్ణయాలు అమలు
ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జీపీఎస్ ప్రకటనపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జగన్ మాట్లాడుతూ 'ఉద్యోగులకు మంచి చేస్తాం. ఉద్యోగులు కూడా ప్రభుత్వంలో భాగస్వాములు. వారు బాగుంటేనే ప్రజలు బాగుంటారని నమ్మే ప్రభుత్వం మనది. మీ మనసు నొప్పించరాదనే ఉద్దేశం మాది' అని అన్నారు. పింఛన్‌తో సహా కొన్ని పరిష్కారాల కోసం రెండేళ్లుగా

- మిగతా 2 లో

భాస్కరరెడ్డికి చుక్కెదురు

బెయిల్ ఇవ్వలేమని సీబీఐ కోర్టు స్పష్టీకరణ
కేసు కీలక దశలో ఉన్నదని వ్యాఖ్య

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో 7వ నిందితునిగా ఉన్న వైఎస్ భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌ను సీబీఐ కోర్టు తిరస్కరించింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉండటంతో బెయిల్ మంజూరు చేయలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రస్తుతం వివేకా కేసులో నిందితునిగా చంచల్‌గూడా జైలులో ఉన్న భాస్కరరెడ్డి తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సీబీఐ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఆ పిటీషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. వివేకా హత్యకు జరిగిన కుట్రలో భాస్కర్ రెడ్డి పాత్ర కీలకంగా ఉందని సీబీఐ వాదనలు వినిపించింది. భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై కౌంటరులో కొన్ని కీలక అంశాలు సీబీఐ ప్రస్తావించింది. కుట్ర, సాక్ష్యాల చెరిపివేతలో అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ప్రమేయం ఉందని సీబీఐ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దర్యాప్తును పక్కదారి పట్టించేలా తండ్రీకుమారులు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. వివేకా హత్యకు కుట్ర, సాక్ష్యాల ధ్వంసం వెనక భారీ కుట్రపై దర్యాప్తు కొనసాగుతోంది. ఎస్.శివశంకర్ రెడ్డి ఫోన్ చేసిన నిమిషంలోపే అవినాశ్ రెడ్డి హత్యాస్థలికి చేరారు. ఉదయం 5.20 గంటలకు ముందే అవినాశ్ రెడ్డి, శివశంకర్‌రెడ్డితో గంగిరెడ్డి మాట్లాడినట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారు. కేసు పెట్టొద్దని, పోస్టుమార్టం వద్దని సీఐ శంకరయ్యకు అవినాశ్,

- మిగతా 2 లో

సర్కారీ మార్కు వెట్టి చాకిరీ

- తీవ్ర దుస్థితిలో శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు
- కేటాయించాల్సిన సేవలకు భిన్నమైన విధుల నిర్వహణ
- 10 నుంచి 14 గంటల అనధికారిక పని వేళలు
- ప్రభుత్వ ఉద్యోగమని వస్తే మసక బారుతున్న బతుకు

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో వెట్టి చాకిరీ చేయిస్తోంది. వీరికి సంబంధించిన సర్వీసులకు భిన్నంగా విధులు కేటాయించింది. దీంతో అసలు వీరు సచివాలయ ఉద్యోగస్తులేనా అనే అయోమయం నెలకొంది. వార్డు సచివాలయ ఉద్యోగులకు కేటాయించిన సమయపాలన కూడా వర్తింపజేయలేదు. విచిత్రం ఏమిటంటే... తోటి సచివాలయం ఉద్యోగస్తులు కార్యాలయానికి వచ్చే సమయానికి వీరు ఇంటికి వెళతారు. వారు భోజనానికి వెళ్లే సమయానికి శానిటేషన్ సెక్రటరీలు డ్యూటీ ఎక్కుతారు. ఇదేదో మునిసిపాలిటీల్లో పని చేసే పారిశుధ్య కార్మికుల సమయపాలన లాగా ఉందనుకుంటే పొరపాటే. వీరు కూడా సచివాలయం విధులు నిర్వహించే 10 మంది వార్డు కార్యదర్శులలో ఒకరు. ఇది ఒక టెక్నికల్ పోస్ట్... వీరి అధికారిక పని వేళలు 8 గంటలు, అయితే అనధికారిక పని వేళలు 10-14 గంటలు. వివరాల్లోకి వెళితే... రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మానస పుత్రిక అయిన గ్రామ-వార్డు సచివాలయ వ్యవస్థ ముఖ్య ఉద్దేశం సచివాలయం పరిధిలోని 2 వేల నుంచి 4 వేల జనాభాకు వివిధ రకాల రెవెన్యూ, కుటుంబ సంక్షేమ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణ శాఖ సేవలు, సంక్షేమ పథకాల సేవలు పారదర్శకంగా అందించాలని వార్డు సచివాలయంలో 10 మంది కార్యదర్శులను నియమించారు. అందులో భాగంగా రాష్ట్రంలోని నగరపాలక, పురపాలక సంఘాలలో, మున్సిపల్ కార్పొరేషన్‌లలో వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలను నియమించారు. వీరికి విద్యార్హత బీఎస్సీ (లైఫ్ సైన్స్). అయితే చాలా మంది వార్డు శానిటేషన్ సెక్రటరీలు ఎంఎస్సీ, ఎం.ఫిల్, పీహెచ్‌డీ చేసిన వారున్నారు. వీరు మంచి కార్పొరేట్ కంపెనీలలో పని చేస్తే నెలకు రూ.50 వేల నుంచి లక్ష వరకు జీతం అందుకునే అవకాశం ఉంది. అయితే సీఎం జగన్ సేవా దృక్పథంతో ప్రవేశ పెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవ చేద్దామని మంచి జీవితాలను సైతం వదిలి ఈ ఉద్యోగంలో చేరారు. ఉద్యోగంలో చేరిన మొదటి రెండు నెలల్లోనే వీరు కన్న కలలు కల్లలయ్యాయి. ఆశలు అడియాశలు అయ్యాయి. కారణమేమిటంటే, జాబ్ చార్ట్ ప్రకారం వీరికి కేటాయించిన విధులు కాకుండా 7వ తరగతి చదివిన మునిసిపల్ మేస్త్రీ నిర్వహించే విధులు వీరి చేత చేయిస్తున్నారు. మీరు సచివాలయంలో కూర్చోవడానికి వీల్లేదు, పారిశుధ్య కార్మికుల వెంబడి వెళ్లి వీధులు, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించండి, మునిసిపల్ చెత్త వేసుకునే ట్రాక్టర్, కంపెక్టర్ వెహికిల్, ఆటోల వెంబడి వెళ్లండి అంటూ నిర్బంధ విధులు నిర్వహించేలా నిబంధనలకు విరుద్ధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మునిసిపల్ కమిషనర్‌లు ఆదేశాలిచ్చారు. ఇదేమిటని ప్రశ్నించిన శానిటేషన్ కార్యదర్శులకు చెత్త సరిగ్గా శుభ్రం చేయించలేదని, మురుగు కాలువలు చెత్త చెదారంతో నిండిపోయాయని మెమోలు, షోకాజ్ నోటీసులు ఇచ్చి భయపెట్టారు. కొందరిని సస్పెండ్ చేశారు. వాస్తవానికి పై విధులన్నింటికీ మునిసిపల్ మేస్త్రీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యులు. శానిటేషన్ సెక్రటరీలను జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించనీయకుండా ప్రొబేషన్‌ను బూచిగా చూపించి, బెదిరించి, ఒక

- మిగతా 2 లో

విద్యుత్ చార్జీల మోతకు నిరసన

సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల ఉపసంహరణకు డిమాండ్
కడప ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ ధర్నా

2లో



Admissions 2023 Open at SRM University-AP

SCHOOL OF ENGINEERING AND SCIENCES (SEAS)

BTech · Civil Engineering · Computer Science and Engineering · Electronics and Communication Engineering · Electrical and Electronics Engineering · Mechanical Engineering

MTech · Computer Science and Engineering · Electronics and Communication Engineering · Mechanical Engineering

BSc · Computer Science · Physics · Chemistry · Mathematics · Integrative Biology

MSc · Physics · Chemistry · Environmental Science · Molecular Biology & Biotechnology · Mathematics

SCHOOL OF LIBERAL ARTS AND SOCIAL SCIENCES (SLASS)

BA / BSc* · Liberal Arts · Literature & Languages · History · Economics · Psychology
*Final degree is awarded based on the Major chosen

BCom · International Accounting

PAARI SCHOOL OF BUSINESS

BBA · Human Resource Management · Marketing · Family Business · Finance · Operations and Logistics Management

MBA · Business Analytics · Marketing · Finance · Family Business · Human Resource Management · Operations and Logistics Management

EMBA · Analytics · Entrepreneurship and Family Business · Strategy & Human Resource Management · Marketing · Finance · Operations

Highlights

HIGHER STUDIES
100% Acceptance Rate
50% with Scholarships up to €33,600
20% from the Class of 2022
8% in QS 50 Universities

GLOBAL COLLABORATIONS & RESEARCH INTERNSHIP
Partnership with reputed institutes, such as:
University of California, Davis
Flinders University, Australia
Illinois Institute of Technology, Chicago
University of Wisconsin-Madison
Northeastern University

PLACEMENTS* STATISTICS
- 100% Placements
- No. of recruiters - 800+
- Highest salary - 50 LPA
- Average salary - 9.9 LPA
(*Drive for Class of 2023 continues)

APPLY NOW
Website: www.srmap.edu.in | Email: admissions@srmap.edu.in | Helpline: +91-866 242 9299 | 1800-599-2233 (Toll Free)
University Address SRM University-AP, Neerukonda, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh - 522 240
SRMUAP SRMUAP srmuap srmuap SRMUniversityAP

ఇదీ లోకం!

ఏంటీ? నువు కూడా
అన్న బాధితుడివేనా?

గాలి వాన బీభత్సంతో నేలవాలిన అరటి

- రైతులకు రూ. కోట్లలో నష్టం
- తక్షణం ఆదుకోవాలని ముప్పాళ్ల డిమాండ్

విశాలాంధ్ర - మహానంది: నంద్యాల జిల్లా మహానంది మండలంలో బుధవారం రాత్రి గాలివాన సృష్టించిన బీభత్సానికి వెయ్యి ఎకరాలలో అరటిపంట నేల వాలింది. దానితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికి అందివచ్చిన పంట నేలరాలడంతో దిక్కుతోచని స్థితిలో రైతు కొట్టుమిట్టాడుతున్నాడు. గాలివాన బీభత్సానికి నష్టపోయిన రైతును ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పంట తీవ్రంగా నష్టపోయిన మహానంది మండలం బుక్కాపురం, గోపవరం, మహానంది, తిమ్మాపురం, అల్లినగరం, శ్రీనగరం గ్రామాల్లో శుక్రవారం ముప్పాళ్ళ, సీపీఐ నేతలు పర్యటించారు. గాలి వానతో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలించి, బాధిత రైతులతో మాట్లాడారు. కోట్లలో రైతులకు నష్టం వాటిల్లితే వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేయకుండా ఏమి చేస్తున్నారని ముప్పాళ్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువగా కౌలు రైతులే అరటి సాగు చేశారన్నారు. నష్టపోయిన రైతన్నలకు ఎకరానికి లక్ష రూపాయలు పరిహారం ప్రభుత్వం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట

- మిగతా 2 లో

వాల్ స్ట్రీట్ కథనం అవాస్తవం: క్యూబా

హవానా: క్యూబాలో చైనా సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసేందుకు ఆ రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరినట్లు ఈనెల 8న ది వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన కథనాన్ని అవాస్తవమని క్యూబా కొట్టిపారేసింది. అమెరికాలో కమ్యూనికేషన్స్‌ను అడ్డుకునే ఉద్దేశంతో చైనా గూఢచర్య సైనిక స్థావరాన్ని క్యూబాలో ఏర్పాటు చేసేందుకు రెండు దేశాల ప్రభుత్వాల మధ్య రాజీ కుదిరినట్లు తప్పుడు కథనం ప్రచురితమైందని క్యూబా విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కార్లోస్ ఫెర్నాండెజ్ ఒక ప్రకటన తెలిపారు. క్యూబాపై అవాస్తవాలను ప్రచారం చేయడం కొత్తేమీ కాదని, గతంలోనూ వెనిజులాలో క్యూబా సైన్యం ఉన్నట్లు అబద్ధాలు ప్రచారం చేశారని పేర్కొన్నారు. 2014 జనవరిలో లాటిన్ అమెరికా, కరేబియాన్ మధ్య శాంతి ఒప్పందానికి క్యూబా కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. లాటిన్ అమెరికా, కరేబియన్‌లో అన్ని విదేశీ సైన్యం ఉండటానికి తాము వ్యతిరేకమన్నారు. తమ దేశంలోని గ్వాంటనామాలో అమెరికా అక్రమ సైనిక స్థావరం ఉన్నట్లు వెల్లడించారు. తమపై తప్పుడు ప్రచారం చేయడం, ఆర్థికంగా ఆంక్షలు పెంచడం వల్ల క్యూబాను అస్థిరపర్చేందుకు అమెరికా యత్నిస్తూ ఉంటుందని పేర్కొన్నారు. క్యూబాపై అమెరికా శత్రుత్వం, క్రూరమైన చర్యలు క్యూబా ప్రజలకు హానికరంగా ఉన్నాయని, ఇవి ఏ విధంగానూ సమర్థనీయం కాదని కార్లోస్ వెల్లడించారు.

ఉ.కొరియాలో ఆత్మహత్యలపై నిషేధం

కిమ్ జాంగ్ ఉన్ రహస్య ఉత్తర్వులు

సియోల్: ఉత్తర కొరియాలో ఆత్మహత్యలు పెరిగిపోతుండటంతో అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉత్తర కొరియాలో ఆత్మహత్యలపై నిషేధం విధించారు. ఈ మేరకు రహస్య ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఆత్మహత్యలను నివారించడమే లక్ష్యంగా 'సీక్రెట్ ఆర్డర్'ను తీసుకున్నట్లు రేడియో ఫ్రీ ఆసియా వెల్లడించింది. ఆత్మహత్యలను సోషలిజానికి వ్యతిరేకంగా, దేశద్రోహంగా కిమ్ అభివర్ణించినట్లు పేర్కొంది. ఆత్మహత్యలను అడ్డుకోవడంపై అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించిన క్రమంలో తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆత్మహత్యలు దాదాపు 40 శాతం పెరిగాయని ది మిర్రర్ నివేదించింది. పేదరికం, ఆకలికేకలే ఆత్మహత్యలకు కారణాలు అవుతున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. ఇదిలావుంటే, ఉత్తర కొరియాలో పరిస్థితులు రోజురోజుకూ క్షీణిస్తున్నాయని దక్షిణ కొరియా జాతీయ ఇంటెలిజెన్స్ సేవా విభాగం పేర్కొంది. అంతర్గత అశాంతి పెరుగుతుండటంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. కాగా, ఉత్తర కొరియాలో వరుస అత్యవసర సమావేశాలలో ఈ విశ్వసనీయ ఆత్మహత్యలపై నిషేధం విధించే ఉత్తర్వులు వెలువడినట్లు రేడియో ఫ్రీ ఏషియా పేర్కొంది.

న్యాయ ఉచ్చులో ట్రంప్

రహస్య పత్రాల కేసులో అభియోగాలు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చుట్టూ న్యాయ ఉచ్చు బిగుసుకుంటోంది. ఒకదాని తర్వాత ఒకటిగా ఆయనపై కేసులు నమోదవుతున్నాయి. తాజాగా రహస్య పత్రాల కేసులో తనపై అభియోగాలు మోపినట్టు ట్రంప్ వెల్లడించారు. 2024 అధ్యక్ష ఎన్నికల రేసులో రిపబ్లికెన్ పార్టీ తరపున ముందుకెళుతున్న ట్రంప్‌ను క్రిమినల్ కేసులు వెంటాడుతున్నాయి. 2020 ఎన్నికల్లో ఓటమి తర్వాత ట్రంప్ శ్వేతసౌధాన్ని ఖాళీ చేసే సమయంలో కొన్ని విశ్వసనీయ పత్రాలను వెంట తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతేడాది ఆగస్టులో ఫ్లోరిడాలోని ట్రంప్ నివాసమైన మార్- ఎ- లాగో ఎస్టేట్‌లో ఎఫ్‌బీఐ సోదాలు నిర్వహించింది. క్లాసిఫైడ్ పత్రాలను ఇతర మ్యాగజైన్‌లు, వార్తా పత్రికల మధ్య కలిపేశారని అధికారులు వెల్లడించారు. తాజా పరిణామాలపై టంప్ స్పందిస్తూ ' అవినీతిభరిత బైడెన్ ప్రభుత్వం నాపై మరోసారి ఆరోపణలు చేసింది' అని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ట్రంప్‌పై అభియోగాలు నిజమని తేలితేగనుక ఫెడరల్ ఆరోపణలు ఎదుర్కొనున్న మాజీ కమాండర్ ఇన్ చీఫ్‌గా ట్రంప్ నిలుస్తారు. అయితే ఈ వ్యవహారంలో న్యాయశాఖ నుంచి ఎలాంటి స్పందన లేదు. తాజా అభియోగాల గురించి ట్రంప్ న్యాయవాదులకు గురువారం సమాచారం అందించినట్లు ఇద్దరు అధికారులు వెల్లడించారు.

ఉక్రెయిన్‌కు చివరి వరకు తోడుంటాం

అన్ని విధాలా సహకరిస్తాం: బైడెన్, సునాక్

వాషింగ్టన్: రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు తోడ్పాటు అందిస్తామని, చివరి వరకు వెన్నుదన్నుగా నిలుస్తామని, ఆర్థికంగానే కాకుండా ఇతర సహాయ సహకారాలు అందిస్తామని అమెరికా, బ్రిటన్ దేశాధినేతలు జో బైడెన్, రిషి సునాక్ సంకల్పించారు. ఇద్దరు నేతలు శ్వేతసౌధంలోని ఓవెల్ కార్యాలయంలో భేటీ అయ్యారు. అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'ఉక్రెయిన్‌కు అవసరమైన మద్దతివ్వడం అనివార్యమన్నది నేను భావిస్తున్నా' అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు. కీవ్‌తో రష్యా ఆగిపోదన్నది అందరి భావనగా చెప్పారు. నాటో పరిధికి మించి తోడ్పడుతోందని, ఉక్రెయిన్ సైన్యానికి ఆర్థిక, ఇతర సాయాన్ని బ్రిటన్ అందిస్తున్నట్లు ఆ దేశ ప్రధాని రిషి సునాక్ తెలిపారు. అమెరికా, బ్రిటన్ పథంలో యూరోపియన్ మిత్రపక్షాలు నడవకపోయినా ఉక్రెయిన్‌కు తమ సాయం కొనసాగుతుందని సునాక్ స్పష్టంచేశారు. చివరి వరకు ఉక్రెయిన్‌కు తోడుంటామని సంకల్పించారు. ఇద్దరు నేతలు అంతకుముందు పరస్పర సహకార రంగాలపై కృత్రిమ మేధస్సు (ఏఐ), స్వచ్ఛ ఇంధనం, ఖనిజాలు వంటి వాటిపై చర్చించారు. ముడిసరుకుల దిగుమతులకు సంబంధించి జపాన్‌తో ఒప్పందం చేసుకున్నారు. 20ఏళ్లలో తొలి బ్రిటిష్ ప్రధాన కార్యదర్శిని ఎన్నుకునేందుకు నాటోకు ఇదే సమయం కాదా అని ఓ విలేకరి అంటే కావచ్చని బైడెన్ సమాధానమిచ్చారు. 'అన్ని విధాలా సమర్థుడైన ఒక అభ్యర్థి ఉన్నారని, ఈ విషయంలో చర్చోపచర్చలు జరుగుతాయని అని ఆయన తెలిపారు.

డీఎస్సీపై ఊగిసలాట

(మొదటిపేజీ తరువాయి)

గుర్రైంది. నాలుగేళ్ల నుంచి డీఎస్సీ పై ఇదే ధోరణితో జగన్ ప్రభుత్వం ఉంది. ఏటా పదివేల పోస్టులతో మెగా డీఎస్సీ ఇస్తామంటూ నాడు మేనిఫెస్టోలో జగన్ ప్రకటించినప్పటికీ, ఇంతవరకు అది అమలుకు నోచుకోలేదు. నాలుగేళ్లలో కనీసం ఒక డీఎస్సీ ఇవ్వకుండా ఉపాధ్యాయ నిరుద్యోగులను జగన్ సర్కార్ అన్యాయానికి గురిచేసింది. ఎన్నికల హామీని జగన్ పూర్తిగా మడమతిప్పి తమను మోసగించారని నిరుద్యోగులు ధ్వజమెత్తుతున్నారు.

ఉపాధ్యాయ ఖాళీలపై గోప్యత

ఉపాధ్యాయ ఖాళీలపై జగన్ ప్రభుత్వం గోప్యత ప్రదర్శిస్తోంది. జిల్లాల వారీగా అసలెన్ని ఖాళీలున్నాయనేవీ, ఎక్కడెక్కడ ఏ పోస్టులు ఉన్నాయననే దానిపై మౌనంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం ఏపీలో 35 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ లెక్కలు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉపాధ్యాయ ఖాళీలు కేవలం 750 మాత్రమే ఉన్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇచ్చిన జవాబు .. సభ్యులు అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రభుత్వం తాజాగా చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో 9 వేల పోస్టులను బ్లాక్ చేశారు. వాటితో పాటు మరో 6వేల పోస్టులు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జనవరి నాటికి 62 ఏళ్లు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు చాలా మంది పదవీ విరమణ చేయనున్నారు. వాటి ద్వారా పెద్ద మొత్తంలో ఉపాధ్యాయ ఖాళీలు రానున్నాయి. ఇవన్నీ కలిపి మొత్తంగా 20వేల నుంచి 25 వేల వరకు ఖాళీలు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ప్రభుత్వం మాత్రం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఎన్నికల వరకు డీఎస్సీ ప్రకటన సాగదీసి, ఈ ఏడాది డిసెంబర్లో గానీ, జనవరి-24లో గానీ ప్రకటించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఎన్నికలకు రెండు/ మూడు నెలల ముందు డీఎస్సీ ఇచ్చి నిరుద్యోగుల్ని జగన్ ప్రభుత్వం మభ్యపెట్టేందుకు వ్యూహరచన చేస్తోంది. పదేపదే డీఎస్సీ జాప్యంపై నిరుద్యోగ ఉపాధ్యాయ యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

మరో టెట్ ..!

డీఎస్సీకి ముందు మరో టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) నిర్వహించే ఆలోచనలో జగన్ సర్కారు ఉన్నట్లు తెలిసింది. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి రాష్ట్రంలో టెట్ పరీక్షను ఏడాదికి రెండు విడతలుగా నిర్వహించాల్సి ఉండగా, ఏపీలో వాటిని పాటించడం లేదు. ఏడాదిలో కేవలం ఒకే ఒకసారి టెట్‌ను ప్రభుత్వం నిర్వహించి చేతులు దులుపుకుందనే విమర్శలున్నాయి. డీఎస్సీని సాగదీసే వ్యూహంలో భాగంగానే, దానికి ముందు టెట్ నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే ఉపాధ్యాయ అభ్యర్థులు టెట్‌లో చాలాసార్లు అర్హత సాధించి డీఎస్సీ కోసం వేచిస్తున్నారు. డీఎస్సీ లేకుండా టెట్‌ను నిర్వహించడం వల్ల అంత ఉపయోగం ఏమీ లేదని అభ్యర్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి తక్షణమే జంబో డీఎస్సీ ప్రకటించి, పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ చార్జీల మోతకు నిరసన

కడపలో విద్యుత్ బిల్లులు దగ్ధం

విశాలాంధ్ర-కడప బ్యూరో: విద్యుత్ సంస్కరణల పేరిట ప్రభుత్వాలు వినియోగదారులపై సర్దుబాటు, ట్రూ ఆఫ్ చార్జీల భారాలు మోపడాన్ని నిలిపివేయాలని, రాత్రి వేళల్లో అప్రకటిత కరెంటు కోతలు ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కడప ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు కాల్చి నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నా చేస్తున్న వారినుద్దేశించి సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, 200 యూనిట్లు లోపు వారందరికీ ఉచిత విద్యుత్ అందిస్తామని నమ్మబలికిన జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి నిలువు దోపిడీకి పాల్పడుతూ 20వేల కోట్ల రూపాయల భారాలను ప్రజలపై మోపిన ఘనత దక్కించుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు మూరెడు సంక్షేమ పథకాలు ఇచ్చి బారెడు భారాలు మోపి నడ్డి విరుస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో ప్రజలకు అసౌకర్యంగా అప్రకటిత కరెంటు కోతలు విధిస్తున్నారని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద ఉత్పత్తి అవుతున్న కరెంటు ఎక్కడ పోతున్నదని, ఏమైపోతున్నదని ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.ఆంజనేయులు, సి.సుబ్రహ్మణ్యం, పి.చంద్రశేఖర్, సి.బషీరున్నిసా, నగర కార్యవర్గ సభ్యులు సావంత్ సుధాకర్, బందెల ఓబయ్య, కె.మునయ్య, గౌస్, లింగన్న, బ్రహ్మం, నాగిరెడ్డి, నాయక్, మైనుద్దీన్, వలిసిగాండ్ల సుబ్బరాయుడు, హుస్సేన్, భాగ్యలక్ష్మి, పకీరప్ప, కొండయ్య, ఖాదర్ వల్లి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు తదితరులు పాల్గొన్నారు.

12న లొంగిపోవాలని రాఘవకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు రాఘవ మాగుంటకు 15 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీం కోర్టు శుక్రవారం సవరించి జూన్ 12న లొంగిపోవాలని ఆదేశించింది. మాగుంట రాఘవ అమ్మమ్మ బాత్‌రూమ్‌లో పడిపోవడంతో ఆమె ఆస్పత్రి పాలైన విషయాన్ని గుర్తించిన హైకోర్టు రాఘవకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మాగుంట అమ్మమ్మ బాగోగులు చూసేందుకు మరికొందరు ఉన్నారని అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్.వి.రాజు చేసిన వాదనలను న్యాయమూర్తులు అనిరుద్ధ బోస్, రాజేష్ బిందాల్‌తో కూడిన వెకేషన్ బెంచ్ పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో జూన్ 12న మాగుంట లొంగిపోవాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. 'వాదనలను పరిగణనలోకి తీసుకున్న తరువాత, ప్రతివాది అమ్మమ్మ వైద్య పత్రాలను కూడా పరిశీలిస్తే, మా అభిప్రాయం ప్రకారం, జూన్ 12, 2023న లొంగిపోవాలని కోరితే ప్రతివాది విడుదల చేయబడిన ప్రయోజనం నెరవేరుతుంది' అని ధర్మాసనం పేర్కొంది. ప్రారంభంలో మాగుంట రాఘవ తన అమ్మమ్మను కలిశాడని, ఇప్పుడు అతను తిరిగి రావచ్చని ఏఎస్‌జీ పేర్కొంటూ, 'ఇవన్నీ మధ్యంతర బెయిల్ పొందడానికి ఉపాయాలు, ఎందుకంటే వారు సాధారణ బెయిల్ పొందలేరు' అని తెలిపారు. భార్య అనారోగ్యం కారణంగా మాగుంటకు సాధారణ బెయిల్‌తో పాటు మధ్యంతర బెయిల్‌ను ట్రయల్ కోర్టు తిరస్కరించిందని ఏఎస్‌జీ రాజు గతంలో చెప్పారు. రాఘవ తన అమ్మమ్మ ఆసుపత్రి పాలయ్యారని ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు బుధవారం అతనికి మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అంతకుముందు, ట్రయల్ కోర్టు అతనికి మధ్యంతర బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరించింది. నిందితుడిపై మనీలాండరింగ్ విచారణ జరుగుతోందని, ఇది తీవ్రమైన ఆర్థిక నేరమని విస్మరించలేమని పేర్కొంది. సీబీఐ, ఈడీ ప్రకారం, ఆప్ సీనియర్ నాయకుడు, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, మాగుంట రాఘవ, ఇతరులపై కేసులను విచారిస్తున్నారు. మద్యం పాలసీని సవరించేటప్పుడు అక్రమాలకు పాల్పడ్డారు. లైసెన్స్ హోల్డర్లకు అనవసరమైన సహాయం అందించారు. ఢిల్లీ ప్రభుత్వం నవంబరు 17, 2021న ఈ విధానాన్ని అమలులోకి తెచ్చింది. అయితే అవినీతి ఆరోపణల కారణంగా గత ఏడాది సెప్టెంబరు చివరిలో దానిని రద్దు చేసింది. ప్రస్తుతం సిసోడియా జైలులో ఉన్నారు.

ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములే

(మొదటిపేజీ తరువాయి)

తపనపడ్డామని చెప్పారు. భావితరాల దృష్ట్యా జీపీఎస్‌ను తీసుకువచ్చామన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల జీవన ప్రమాణాలను నిలబెట్టేదిగా జీపీఎస్‌ను రూపొందించామని, 62 ఏళ్లకు రిటైరైతే 82 ఏళ్లలో కూడా అదే స్థాయి జీవన ప్రమాణాలు ఉండాలనే ఉద్దేశమం దీని వెనుక ఉన్నదని చెప్పారు. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని డీఆర్‌లు ఇచ్చేలా జీపీఎస్‌లో పొందుపరిచామని సీఎం చెప్పారు. ఉద్యోగ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ అండగా ఉంటానని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ఉద్యోగుల విషయంలో రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను 60 రోజుల్లోగా అమలు చేయాలని సీఎం ఆదేశించారన్నారు. కొత్తగా జీపీఎస్‌ను తీసుకురావడం, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ ఉద్యోగుల విలీనం, పీఆర్సీ కమిషన్ ఏర్పాటుతో సహా ఉద్యోగుల విషయంలో కేబినెట్ నిర్ణయాలపై హర్షం వ్యక్తంచేశారు.

ఉద్యోగుల క్రమబద్ధీకరణ హర్షణీయం: బండి శ్రీనివాసరావు

12వ పీఆర్సీ ప్రకటించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపినట్టు ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను చాలా వరకు పరిష్కరించారన్నారు. 16 శాతం హెచ్‌ఆర్‌ఏ ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపామన్నారు. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఏపీఎన్జీవో కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, ఒప్పంద ఉద్యోగుల 23ఏళ్ల నిరీక్షణ ఫలించిందని అన్నారు. జగన్ తీసుకునే నిర్ణయాలు సాహసోపేతమైనవిగా ఉంటాయని శివారెడ్డి కొనియాడారు.

గాలి వాన బీభత్సంతో నేలవాలిన అరటి

(మొదటిపేజీ తరువాయి)

నష్టాన్ని గుర్తించి వెంటనే ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. నష్టపోయిన రైతులకు తక్కువ ధరకే ఎరువులు అందజేయాలన్నారు. ఈ పర్యటనలో ముప్పాళ్ల వెంట సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగ నాయుడు, సహాయ కార్యదర్శి బాబా ప్రక్రుద్దీన్, కార్యవర్గసభ్యులు పి.సుంకయ్య, మోటా రాముడు, సుబ్బారాయుడు, బుక్కాపురం శాఖ కార్యదర్శి మిద్దె రామేశ్వరయ్య, నంది పల్లె శాఖ కార్యదర్శి మిద్దె ప్రతాప్, అబ్బీపురం మండల సహాయ కార్యదర్శి తుపాకుల వెంకటేశ్వర్లు, మద్దిలేటి, మిద్దె పర్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఉధృత పోరాటాలు చేసేందుకు సన్నద్ధం కావాలని పిలుపుచ్చారు. సమావేశానికి మోట రాముడు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు పాల్గొన్నారు. ముప్పాళ్ల మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ప్రజా పోరాటాల ద్వారా సీపీఐ ప్రజా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

భాస్కరరెడ్డికి చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

శివశంకర్ రెడ్డి చెప్పారు. సీబీఐకి, కోర్టుకు ఏమీ చెప్పొద్దని దస్తగిరిని ప్రలోభపెట్టే ప్రయత్నం చేశారు. దస్తగిరిని ప్రలోభపెట్టేందుకు అవినాశ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి అనేక ప్రయత్నాలు చేశారని సీబీఐ న్యాయవాది తన వాదనలు వినిపించారు. మరోవైపు భాస్కరరెడ్డికి ప్రస్తుత పరిస్థితుల్లో బెయిల్ ఇస్తే సాక్షులను, దర్యాప్తును ప్రభావితం చేస్తారంటూ వివేకా కుమార్తె సునీత లిఖితపూర్వక వాదనలు సమర్పించారు. వివేకా హత్య కేసు లోతుగా దర్యాప్తు జరగాల్సి ఉంది.భాస్కర్‌రెడ్డికి బెయిల్ ఇస్తే సాక్షులను, దర్యాప్తును ప్రభావితం చేస్తారు.కడప, పులివెందుల ప్రాంతాల్లో భాస్కర్‌రెడ్డి చాలా ప్రభావితం చేయగల వ్యక్తి. అరెస్టు చేసినప్పుడు కడపలో జరిగిన ధర్నాలు, ప్రదర్శనలే భాస్కర్‌రెడ్డి బలానికి నిదర్శనం. భాస్కర్‌రెడ్డి బయట ఉంటే చాలు.. పులివెందుల సాక్షుల ప్రభావితమైనట్లే. భాస్కర్‌రెడ్డికి బెయిల్ ఇస్తే ఎన్ని షరతులు పెట్టినా నిరుపయోగమే. సాక్షులను, ఆధారాలను ప్రభావితం చేస్తే కేసుకు పూడ్చలేని నష్టం. దర్యాప్తునకు సహకరించానని భాస్కర్‌రెడ్డి చెప్పడం అబద్ధం.కడప ఎస్పీ సమాచారం మేరకు భాస్కర్‌రెడ్డిపై గతంలో మూడు కేసులున్నాయి. పేలుడు పదార్థాల చట్టం సహా మూడు కేసులు గతంలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. వాటిలో రెండు కేసులు వీగిపోగా.. మరొకటి తప్పు కేసుగా తేల్చి కొట్టివేశారు. కేసుల ప్రకారం కాని, వివేకా హత్యలో ప్రమేయాన్ని చూసినా.. భాస్కర్‌రెడ్డి నేపథ్యం ప్రశ్నార్థకమే. ఏప్రిల్-16 నుంచి జైల్‌లో ఉన్నంత మాత్రాన బెయిల్ ఇవ్వడానికి అది కారణం కారాదు అంటూ సునీత కోర్టుకు తెలిపారు. సీబీఐ, సునీత వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం భాస్కరరెడ్డి బెయిల్ పిటీషన్‌ను కొట్టివేసింది.

దేశంలో పాల సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగానే ఉండవచ్చు. మరి ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు మోదీ ప్రభుత్వం చేస్తున్నదేమిటన్న ప్రశ్న వ్యక్తమవుతోంది. ఇదే అంశమై బీజేపీ ప్రభుత్వాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రశ్నించింది. దేశం సంక్షోభం అంచునకు చేరుకుంటుంటే మోదీ ప్రభుత్వం ఏం చూస్తోందని నిలదీసింది. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సహకార సంఘాల మధ్య చిచ్చు పెట్టడంలో మోదీ సర్కార్ నిమగ్నమై ఉన్నదంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్విట్టర్‌లో విమర్శించారు.

సర్కారీ మార్కు వెట్టి చాకిరీ

(మొదటిపేజీ తరువాయి)

మునిసిపల్ పారిశుధ్య కార్మికునిగా చూస్తున్నారు. వీరికి సంబంధం లేని విధులు అంటగట్టి, సంబంధం లేని విషయాలలో శానిటేషన్ సెక్రటరీలను బాధ్యులను చేస్తూ కార్మికుల ముందు, బహిరంగంగా వీధుల్లో తిడుతూ అవమానిస్తున్నారు. శానిటేషన్ సెక్రటరీలు విధి లేని పరిస్థితుల్లో ఆత్మగౌరవం చంపుకుని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లకు బానిసలుగా పని చేస్తున్న దుస్థితి నెలకొంది. ఈ బానిస బతుకులు వద్దని కొంతమంది జాబ్ వదిలి, ప్రైవేట్ కంపెనీలకు వెళ్లారు. కొంత మంది ఆత్మహత్యా ప్రయత్నం చేయగా వారిలో ఇద్దరు మరణించారు. అయినప్పటికీ అధికారుల తీరులో మార్పు రాలేదు. పర్మినెంట్ అయ్యాక తమ బతుకులు మారుతాయని కలలు కన్నారు. ప్రొబేషన్ పూర్తి చేసుకున్నాక కూడా వీరికి ఇవ్వాల్సిన సర్వీసులు ఇవ్వకుండా, మేస్త్రి పనులు చేయిస్తున్నారు.

ప్రాణాల మీదకు తెస్తున్న చెత్త పన్ను

ప్రభుత్వం విధించిన చెత్త పన్ను వార్డు శానిటేషన్ సెక్రటరీల ప్రాణాల మీదకు తెస్తోంది. చెత్త పన్ను 100 శాతం వసూలు చేయాలని, లేకపోతే మీ జేబులో నుంచి కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇటీవలే విశాఖపట్నంలో జోనల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు కలిసి ఒక కార్యదర్శి నుంచి అతని వార్డు చెత్త పన్ను మొత్తం ప్రభుత్వానికి చెల్లించేలా ఒత్తిడి చేసి అతని మరణానికి కారకులయ్యారు. ఆ ఉద్యోగి కుటుంబాన్ని రోడ్డున పడేలా చేశారు.

అసలు వీరి విధులేంటి... సమయపాలన ఎలా?

వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు తన వార్డు పరిధిలో ఘన-ద్రవ వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ట్రేడ్ లైసెన్స్‌లు, శానిటేషన్ సర్టిఫికెట్ల జారీ, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం, అలాగే తడి-పొడి చెత్తగా వేరు చేసేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం, మొక్కలు నాటించడం, ఎన్‌జీటీ నిబంధనలు అమలయ్యేలా చూడటం మొదలగు విధులు. అయితే ఉన్నతాధికారులు

శానిటేషన్ సెక్రటరీల సేవలను చెత్తను శుభ్రం చేయించడానికే ఉపయోగిస్తున్నారు. ఇక శానిటేషన్ సెక్రటరీలు మిగిలిన వార్డు కార్యదర్శుల లాగే ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలని కచ్చితమైన నిబంధనలు ఉన్నాయి. ఎంఏయూడీ వారు సమాచార హక్కు చట్టం ద్వారా వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల సమయపాలన మిగతా వార్డు కార్యదర్శుల లాగే ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అని పేర్కొన్నారు. అయినప్పటికీ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కమిషనర్లు వీరిని బెదిరిస్తూ, మీకు ఈ సమయ పాలన వర్తించదని, మీరు కార్మికుని లాగే ఉదయం 5 గంటలకు రావాలని హుకుం జారీ చేశారు. అంటే ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వర్కర్ల వెంబడే. ఇక పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, కృష్ణా, కడప జిల్లాల్లోని మునిసిపల్ కమిషనర్‌లు.... మీకు పండుగ, పబ్లిక్ సెలవులు, ఏవి వర్తించవని, మీరు 24/7 పని చేయాల్సిందే అని, ప్రతి గంటకు ఒకసారి పారిశుద్ధ కార్మికులతో పని చేస్తున్న చోట సెల్ఫీ దిగి గ్రూప్ ఫోటోలు పోస్ట్ చేయాలని వింత ఆదేశాలు జారీ చేశారు. జగ్గయ్యపేటలో డంపింగ్ యార్డు పర్యవేక్షణకు వీరిని నియమిస్తూ సర్క్యులర్ జారీ చేశారు. ఉన్నత విద్యను అభ్యసించి కార్యాలయంలో పని చేయాలనే వారి కల దంపింగ్ యార్డులో దుమ్ముకొట్టుకు పోతోంది.

స్పందన కార్యక్రమానికి కొత్త అర్థం చెప్పిన శానిటరి ఇన్‌స్పెక్టర్లు

ముఖ్యమంత్రి ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమంలో ప్రతి అధికారి రోజూ 3 నుంచి 5 గంటల సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. వార్డు శానిటేషన్ కార్యదర్శులు తాము స్పందన కార్యక్రమానికి రోజూ సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేకుంటే మాకు డీఎల్‌డీవో, జీసీ, కలెక్టర్ సచివాలయం సందర్శిస్తే మాకు మెమోలు ఇస్తారని చెప్పినప్పటికీ, మీరు స్పందనలో కూర్చోవసరం లేదని, ఫీల్డ్‌లో కార్మికుల వెంబడి, ట్రాక్టర్ల వెంబడి ఉండి కాలువలు, వీధులు శుభ్రం చేయిస్తే, మీకు ఫిర్యాదులే రావు కదా అని సమాధానమిచ్చారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఈ విధంగా కొత్త భాష్యం చెప్పారు. ఇటీవల మిగతా వార్డు కార్యదర్శుల లాగే వీరికి అన్ని రకాల సెలవులు వర్తిస్తాయని సీడీఎంఏ ఉత్తర్వులు ఇచ్చినా, వాటిని తుంగలో తొక్కారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం కడప జిల్లాల్లో కమిషనర్లు... మహిళలు, నిండు గర్భిణులు, పిల్లల తల్లులని కూడా చూడకుండా మీ వార్డుల్లో చెత్త ఎక్కడబడితే అక్కడ ఉందంటూ మీకు సెలవులు ఇవ్వడం కుదరదని బెదిరిస్తున్నారు. శానిటేషన్ సెక్రటరీలను మానసిక క్షోభకు గురి చేస్తూ సగటు ఉద్యోగిగా వారు పొందవలసిన హక్కులను కాలరాస్తూ, సమయపాలన లేకుండా, సెలవులు లేకుండా పని చేయిస్తూ ఉన్నతాధికారులు మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నా ఉద్యోగ సంఘాలు చోద్యం చూస్తున్నాయి. ఇక తమ సమస్యలపై వార్డు శానిటేషన్ సెక్రటరీలు ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదు. ఇకనైనా తమకు సంబంధించిన సేవలను కేటాయించి, ఇతర కార్యదర్శుల లాగా సమయపాలన ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధి నిర్వహణ ఉండేలా గట్టి ఆదేశాలివ్వాలని వారు కోరుతున్నారు. మరోవైపు, ఈ విషయాలేవీ ముఖ్యమంత్రి దృష్టికి పోనివ్వకుండా శానిటేషన్ సెక్రటరీలకు ముఖ్యమంత్రి పట్ల ఏహ్యభావం కలిగేలా వీరిపై అధికారులు ఇలా వేధిస్తున్నారేమో అని అనుమానిస్తున్నారు.

సచివాలయ స్ఫూర్తి నిర్వీర్యం

రాష్ట్రంలో 20 లక్షల మంది పోటీ పడి జిల్లా ఎంపిక కమిటీ పరీక్షల ద్వారా అర్హత పొంది ఉద్యోగం సాధించిన వార్డు శానిటేషన్ సెక్రటరీలను వారి జాబ్ చార్ట్‌లో లేని 7వ తరగతి మేస్త్రి పనులు చేయాలని వేధించడం దారుణమని వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జి.ఈశ్వరయ్య అన్నారు. వారికి సంబంధించిన టెక్నికల్ సర్వీసెస్ ఇవ్వకుండా సచివాలయ స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. శానిటేషన్ సెక్రటరీలను వేధిస్తున్న కమిషనర్‌లపై సీఎం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి విషయానికి సచివాలయం ఉద్యోగస్తులను వేధిస్తే ఉపేక్షించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

- జి.ఈశ్వరయ్య , వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్ మెంట్ సెక్రటరీల అసోసియేషన్ గౌరవాధ్యక్షులు

అవన్నీ వదంతులే...

పైలట్ కొత్త పార్టీపై కాంగ్రెస్

న్యూఢిల్లీ : జూన్ 11న తన తండ్రి రాజేష్ పైలట్ వర్ధంతి సందర్భంగా తమ నాయకుడు సచిన్ పైలట్ ప్రత్యేక పార్టీని ప్రకటించే అవకాశం ఉందన్న వదంతులను కాంగ్రెస్ శుక్రవారం తోసిపుచ్చింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ పార్టీ ఐక్యంగా ఉందని, రాజస్థాన్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని అన్నారు. రాజేష్ పైలట్ వర్ధంతికి ఒక రోజు ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'నేను వదంతులను నమ్మను. వాస్తవమేమిటంటే, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అశోక్ గహ్లోత్, సచిన్ పైలట్‌తో చర్చించారని, ఆ తర్వాత మేం కలిసి వెళతామని చెప్పారని, అది కాంగ్రెస్ పార్టీ పరిస్థితి' అని ఆయన పీటీఐకి చెప్పారు. పైలట్ కొత్త పార్టీని ప్రారంభించనున్నట్లు వస్తున్న నివేదికల గురించి ప్రత్యేకంగా అడిగినప్పుడు, 'నాకు తెలిసినట్లుగా, అలాంటిదేమీ లేదు' అని అన్నారు. ఈ మధ్య కాలంలో తాను పైలట్‌ను కలిశానని, అలాంటిదేమీ లేదని వేణుగోపాల్ చెప్పారు. మీడియా కూడా ఆశాజనకంగా ఉండాలని, ఇలాంటి పుకార్లను నమ్మవద్దని అన్నారు.

గ్రామీణ వైద్య సేవకులకు గుర్తింపు పత్రాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- ఆర్ఎంపీలకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన అఖిల పక్షనేతలు

విశాలాంధ్ర- విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 108, 104, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కంటే గ్రామీణ వైద్య సేవకులు అందించే సేవలకు ప్రజాదరణ ఉంటుందనీ, గ్రామీణవైద్య సేవకులు (ఆర్ఎంపీ, పీఎంపీ)లకు ప్రభుత్వం గుర్తింపు పత్రాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆఫ్ ఎక్స్‌పీరెన్స్‌డ్ మెడికల్ ప్రాక్టీషినర్స్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన పాల్గొన్నారు. విజయవాడలోని శుక్రవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జీఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రామకృష్ణ మాట్లాడుతూ స్వయం శక్తితో నమ్మకాన్ని సాధించుకుని క్షేత్రస్థాయిలో వైద్యవృత్తిని కొనసాగిస్తున్న ఆర్ఎంపీలను గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. 2008లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి స్వయంగా డాక్టర్ అయిన కారణంగా బాగా ఆలోచించి ఆర్ఎంపీ, పీఎంపీలకు గుర్తింపునిస్తూ జీవో 429 జారీ చేశారని గుర్తు చేశారు. గ్రామీణ వైద్య సేవకులకు హెచ్ఎంఆర్ఐ ద్వారా నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చారన్నారు. 2009లో జీవో 1273 ద్వారా ఆర్ఎంపీలను కమ్యూనిటీ పారామెడిక్స్‌గా పేరు నిర్ణయించి రూ.2.32 కోట్ల నిధులు కేటాయించారన్నారు. రాష్ట్ర విభజన తరువాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం 2017లో జీవో 465 ఇచ్చి వారికి న్యాయం చేస్తామని చెప్పి నిర్లక్ష్యం చేశారనీ, ఆ జీవోను అమలు చేయమని మాత్రమే ఆర్ఎంపీలు అడుగుతున్నారని చెప్పారు. కేవలం సర్టిఫికేట్లు ఇవ్వటం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని చెప్పారు. గ్రామాల్లో, ఏజన్సీ ప్రాంతాల్లో ఆర్ఎంపీలకు సేవలు అమూల్యమైనవి అన్నారు. ఇటీవల అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలో తనకు ఎదురైన సంఘటనను రామకృష్ణ వివరించారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి గ్రామీణ వైద్య సేవకులను గుర్తించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ దేశంలో వైద్యం పరిస్థితి ఎలా ఉందో కరోనా కాలంలో స్పష్టమైందన్నారు. వైద్యం సేవలు అందించటం అంటే కేవలం డాక్టర్లు పరీక్షించి మందు రాయటం కాదని, పారామెడికల్ విభాగం, ఫార్మశీ, సాంకేతిక పరికరాల వినియోగం వంటి అనేక అంశాలు ఉంటాయని చెప్పారు. డబ్ల్యూ హెచ్ఓ నివేదిక భారత్‌లో 57.6 శాతం మంది దొంగ సర్టిఫికేట్లు కలిగిన నకిలీవైద్యులు ఉన్నారని పేర్కొన్న అంశాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తావలి మాట్లాడుతూ వృత్తికి భద్రత కల్పించాలని కోరుతున్న ఆర్ఎంపీల ఉద్యమానికి కాంగ్రెస్‌పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం వలంటీర్లను నియమించి సేవలు అందిస్తున్నట్లే ఆర్ఎంపీల సేవలను ప్రజల కోసం వినియోగించుకోవాలని సూచించారు. విద్య, వైద్యం, విద్యుత్ వంటి ప్రజలకు ప్రధానంగా అవసరమైన అన్ని రంగాల్లో సీఎం జగన్ మాట తప్పారని విమర్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు గాంధీ, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బాబ్జి తదితరులు గ్రామీణ వైద్య సేవకులకు మద్దతుగా ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జీఎస్.ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్న సమయంలో తమకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు ఇచ్చే అంశాన్ని చర్చించి గుర్తింపు పత్రాలు ఇవ్వాలని కోరారు. సెప్టెంబరులో రాష్ట్రంలోని 30 వేల మంది గ్రామీణ వైద్య సేవకులతో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బాబూరావు, కోశాధికారి సీహెచ్.వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ జె.జోషి, రాష్ట్ర కార్యదర్శి ఎం.సుధాకర్, సమాచార శాఖ విభాగం చైర్మన్ ఎం.ఉపేంద్ర రెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ ఎస్.ఉమాశంకర్, సలహాదారులు డాక్టర్ ఎస్.ఎల్‌రావు, జోనల్ కార్యదర్శి జె.రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా 400 మంది గ్రామీణ వైద్య సేవకులు హాజరయ్యారు.

కౌరవ వధ తప్పదు

ఐ-టీడీపీ అభినందన సదస్సులో చంద్రబాబు హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కౌరవ సభను గౌరవ సభగా చేసి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఇందుకోసం వచ్చే కురుక్షేత్రంలో కౌరవ వధ తప్పదని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఐ-టీడీపీ అభినందన సదస్సులో చంద్రబాబు మాట్లాడుతూ 'ఎన్నికలకు తొమ్మిది నెలలే ఉంది. యుద్ధానికి అంతా సిద్ధం కావాలి. ప్రతి వ్యక్తి శక్తివంతమైన ఐటీ సాధనం కావాల'ని పిలుపునిచ్చారు. ఐ-టీడీపీ కార్యకర్తలకు ఉపాధి కల్పిస్తాం, కంపెనీలతో మాట్లాడి వర్క్ ఫ్రమ్ హోం లేదా ఆఫీసుల్లో పని కల్పిస్తాం. సామర్థ్యం, నైపుణ్యతను బట్టి విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. వచ్చే ఎన్నికలు దోపిడిదారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధం. దోచుకున్న డబ్బంతా పేదలకు పంచుతాం. పార్టీకి ప్రచార సాధకులు ఐ-టీడీపీ కార్యకర్తలు, సెల్‌ఫోన్ ఉపయోగించి ప్రపంచాన్ని జయిస్తున్నారు. ఐ-టీడీపీ ద్వారా ఫోన్లనో క్షణాల్లో పార్టీ కార్యక్రమాల సమాచారాన్ని చేరవేస్తున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేశారు. మహానాడులో ప్రకటించిన టీడీపీ మినీ మేనిఫెస్టో కొన్ని గంటల్లోనే సామాజిక మధ్యమాల ద్వారా ప్రతి ఇంటికి చేరింది. పేదల్ని ధనికుల్ని చేయాలన్న సంకల్పంతో ఫార్ములా - 4 తీసుకున్నాం. పేదలంటే గిట్టని వాళ్లు పార్ములా-4పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు కానీ నా విజన్‌తో పేదల్ని ధనవంతులుగా చేసి తీరుతా, అదే నా జీవిత ఆశయం' అని చంద్రబాబు అన్నారు. ఐ-టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలని సూచించారు. నంబూరులో హజ్ యాత్రకు వెళ్లే వారిని కలవడానికి ముందుగా షెడ్యూలిచ్చినా నన్ను అనుమతించలేదు. అదే షెడ్యూల్‌కి సీఎం వెళ్లారు. దీనిని ఏమనాలి? అధికారం ఉందని ఇష్టారుసారంగా వ్యవరించటం సిగ్గుచేటు. టీడీపీ హయాంలో రూ. 140 కోట్లు కేటాయించి హజ్‌హౌజ్‌కి శంకుస్థాపన చేశాం కానీ జగన్ దాన్ని నిర్వీర్యం చేశారు. హజ్ హౌస్ కట్టలేని ముఖ్యమంత్రి మూడు రాజధానులు కడతారట! టీడీపీ అధికారంలోకి రాగానే దేశంలో ఎక్కడా లేని విధంగా విజయవాడలో హజ్ హౌస్ నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించారు. భోగాపురం విమానాశ్రయం, మచిలీపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్‌కి రెండోసారి శంకుస్థాపనలు చేశారు తప్ప ఒక్క అడుగు ముందుకు పడలేదని విమర్శించారు. అమరావతి ఎక్కడికీ వెళ్లదు. మేం రాగానే పనులు పరుగులు పెట్టిస్తాం. జగన్‌కిచ్చిన సమయం ముగింది. వైసీపీ పాలనకు అంతం దగ్గర పడింది అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సమావేశంలో ఎన్నార్టీ మాజీ చైర్మన్ వేమూరి రవికుమార్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమా మహేశ్వరరావు, మహాసేన మీడియా అధిపతి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి

విజయవాడలో అమ్మకానికి పోస్టులు: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోని పారిశుధ్య కార్మికు లను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆసుల రంగనాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడి దాసరి భవన్‌లో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కరోనా సమయంలో మున్సిపల్ ఎంప్లాయిస్ కాళ్లకు దండంపెట్టి పూలదండలతో ఘనంగా సన్మానించి రెగ్యులర్ చేసే సమయానికి వెనుకడుగు వేస్తున్నారని విమర్శించారు. ఈ కార్మికులకు నిత్యం పని ఉంటుందని అందు వల్ల వీరిని క్రమబద్ధీ కరిం చటం తప్పని సరి అన్నారు. పారిశుధ్య విభాగంలో పర్మినెంట్ ఉద్యోగులు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా హెల్త్ అలవెన్స్ కూడా నిలిపివేశారని తెలిపారు. ఇంజినీరింగ్ సెక్షన్, పార్కుల్లో పని చేసే వారికి కనీస వేతనాలు అమలు జరగటం లేదన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమ్మకానికి పారిశుధ్య కార్మికుల పోస్టులు ఉన్నాయని విమర్శిం చారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు, అనారోగ్యంతో పనిచేయలేని వారి కుటుంబ సభ్యులకు ఇవ్వాల్సిన పోస్టులను వెలకట్టి ఇతరులకు అమ్ము తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సూత్ర దారులు, పాత్రదా రులుగా ఉన్నారని తెలిపారు. ఈ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని ఇంటింటికీ కరపత్రాల పంపిణీ ద్వారా వివరి స్తామ న్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకపోతే అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విజయ వాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు జక్కి జేమ్స్ పాల్గొన్నారు.

డిగ్రీలు, పీజీలు చేసిన వారికి డంప్ యార్డులో డ్యూటీలా...

ఈశ్వరయ్య

విశాలాంధ్ర- విజయవాడ: డిగ్రీలు, పీజీలు చేసిన సెక్రెటరీలకు డంప్‌యార్డులో చెత్తకు నిప్పు పడకుండా చూసుకోవాలని షిఫ్టుల వారీగా జగ్గయ్యపేట మునిసిపల్ కమిషనర్ డ్యూటీలు వేయడాన్ని వార్డు శానిటేషన్-ఎన్విరాన్మెంట్ సెక్రటరీల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జి.ఈశ్వరయ్య తీవ్రంగా తప్పుబట్టారు. ఈ ఉత్తర్వులు ఉపసంహరించుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం ఇక్కడి దాసరి భవన్‌లో ఈశ్వ రయ్య విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న వార్డు శానిటేషన్-ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు రాష్ట్ర వ్యాప్తంగా జూన్-1 నుంచి ఉద్యోగం చేరే సమయంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సచివాలయంలో ఉదయం 10.30నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ఆయా మున్సిపల్ కమిషనర్‌లకు వినతిపత్రం రూపంలో తెలిపామన్నారు. దీన్ని జీర్ణించుకోలేని కొందరు కమిషనర్లు మీరు కేవలం పారిశుధ్య కార్మికుల సమయపాలనలో హాజరు కావాలని, సచివాలయంలో మీకు పనేంటి అని హెచ్చరిస్తూ సెక్రటరీలకు మెమోలు, షోకాజ్‌లు ఇస్తూ భయబ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. జంగారెడ్డిగూడెం, ప్రొద్దుటూరు, జగ్గయ్యపేట, పెడన, కాకినాడ, గుంతకల్, జమ్మలమడుగు, కడప మునిసిపాలిటీలలో కమిషనర్లు బెదిరింపులు చేస్తూ, బదిలీలకు సంబంధించిన నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వకుండా, సచివాలయంలోని అటెండన్స్‌లో వీరు గైర్హాజరు అయినట్టు రాసి, వీరికి శాలరీ పెట్టకండి అని, మిమ్మల్ని సస్పెండ్ చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. ఉద్యోగులను ఐక్యం చేసి మున్సిపల్ కార్యాలయాలను ముట్ట డిస్తామన్నారు. అనంతరం వార్డు శానిటేషన్- ఎన్విరా న్మెంట్ సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈశ్వరయ్యతో పాటు వార్డు శానిటేషన్-ఎన్విరాన్మెంట్ సెక్రటరీల రాష్ట్ర నాయకులు లంకా గోవిందరాజులు ప్రభుత్వ ప్రధాన సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి ఆయన దృష్టికి, పురపాలక శాఖమంత్రి ఆదిమూలపు సురేశ్ దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రం అందజేశారు. వారు సానుకూలంగా స్పందిస్తూ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఈశ్వరయ్య తెలిపారు.

అమరావతిని సందర్శించండి

నేపాల్ మాజీ పీఎంకు ఏఐపీపీ నేత జాస్తి వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బౌద్ధారామ క్షేత్రంగా వెలుగొందు తున్న అమరావతిని సందర్శించాలని నేపాల్ దేశ మాజీ ప్రధానమంత్రి లోకేంద్ర బహదూర్ చంద్‌ను అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూ ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆహ్వానించారు. నేపాల్ రాజధాని ఖాట్మండులో శుక్రవారం ఆయనతో జాస్తి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ లోని అమరావతి విశిష్టతను తెలియజేస్తూ, గౌతమ బుద్ధుల వారి ధాతువులు, మహా చైత్యం, బౌద్ధ శిల్ప సంపదను, ధ్యాన బుద్ధ ప్రాజెక్టును ఒక్కసారి సందర్శించాలని కోరారు. నేపాల్ దేశానికి నాలుగు సార్లు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి ఆ దేశ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన లోకేంద్ర బహదూర్ చంద్‌ను అభినందిస్తూ దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో జాస్తి సత్కరించారు. వీరాంజనేయులును నేపాల్ మాజీ పీఎం సత్కరించారు. ఏపీ పంచాయతీ వ్యవస్థ పటిష్ఠతకు దానికున్న ప్రాధాన్యతను ఈసందర్భంగా జాస్తి వివరించారు.

ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తారా? గద్దె దిగుతారా?

పాలకులకు లెనిన్ బాబు ప్రశ్న

విశాలాంధ్ర-తిరుపతి: ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరుద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని పాలకులను ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేయాలని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వకలేనిపక్షంలో నెలకు రూ.10వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా సమితి సమావేశం శుక్రవారం స్థానిక గంధమునేని శివయ్య భవన్‌లో జిల్లా అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లెనిన్ బాబు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న హామీని మోదీ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. రైల్వే శాఖలో మూడు లక్షలకుపైగా ఉన్న ఖాళీలను భర్తీ చేసేదెప్పుడని ప్రశ్నించారు. ఉపాధ్యాయ నియమాల కోసం ఆరేళ్లుగా నోటిఫికేషన్ రాక నిరుద్యోగులు తీవ్ర నిరాశ గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. గ్రూప్ 1,2, ఉద్యోగాల సంఖ్యను పెంచాలని, ఎస్సై కానిస్టేబుల్ పోస్టులు 20,000లకు పైగా, గ్రామ సచివాలయాల్లో 22,500ల ఖాళీలు ఉన్నాయని, వీటి భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాకపోవడంతో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు యువత తరలిపోతున్నారని లెనిన్‌బాబు అన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండి చలపతి ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మల్లికార్జున, నాగరాజు, తరుణ్ కుమార్, నాగార్జున్, మురళివీరబాబు, వెంకటేశ్, నాగేశ్, గణేశ్, భరత్ పాల్గొన్నారు

కార్మికుల కడుపు కొడుతున్న జగన్

- ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పడాల రమణ
- సమస్యల పరిష్కారానికి 20న 'చలో విజయవాడ'

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్): భవన నిర్మాణ రంగ కార్మికుల పెండింగ్ క్లెయిములు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు 'చలో విజయవాడ' కార్యక్రమం చేపడుతున్నట్లు ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ తెలిపారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తండ్రిని మించిన తనయుడుగా ఉంటానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్... తండ్రి పెట్టిన పథకానికి తూట్లు పొడిచి రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికుల కడుపు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996 దేశవ్యాప్తంగా అమలవుతున్నా... రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బోర్డును తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న సుమారు 45 వేల క్లెయిముల నిధులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ యూనియన్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నదన్నారు. సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి రద్దు చేయాలనే దుర్మార్గపు ఆలోచనలో సీఎం వైఎస్ జగన్ ఉన్నారని విమర్శించారు. ఒక పక్క కరోనా, మరో పక్క ఇసుక కొరత, సిమెంటు, ఐరన్ కలప గృహోపకర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోతున్న నేపథ్యంలో భవన నిర్మాణరంగం కుదేలై కార్మికుల కుటుంబాలకు పూట గడవటం కష్టంగా మారిందన్నారు. తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటూ అనేక మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా కార్మికులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారి కష్టాన్ని మరింతగా పెంచి గడప గడప వైసీపీ అని సంబరాలు చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన 1200 కోట్లు సంక్షేమ బోర్డు నిధులను వెంటనే బోర్డుకి జమ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మిక నిధులను వారి ప్రయోజన కోసం ఖర్చుపెట్టాలని, ఇష్టానుసారంగా పెంచుకుపోతున్న స్టీలు, సిమెంటు, రా మెటీరియల్ మొదలైన ధరలను నియంత్రించాలన్న డిమాండ్లతో తాడోపేడో తేల్చుకు నేందుకు జరుగబోతున్న ఈ మహా పోరాటంలో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్. వెంకట సుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నాలుగేళ్లుగా ఎమ్మెల్యేలు, మంత్రుల నుండి ముఖ్యమంత్రి వరకు, జిల్లా రెవెన్యూ, లేబర్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చి ఆందోళన చేస్తున్నప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి చట్టం అమలుపై తీవ్ర నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుంచి నవరత్నాలకు మళ్లించిన నిధులను తక్షణమే బోర్డుకు జమ చేయాలని, గతంలో బోర్డు ద్వారా అమలు చేసిన సంక్షేమ పథకాలను కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 20వ తేదీలోగా ప్రభుత్వం స్పందించకుంటే తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సోనా రాజు, నాయకులు రామస్వామి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వారికే వెచ్చించాలి

దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వారికే వెచ్చించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా సమితి అధ్వర్యంలో స్థానిక బాలాజీ కాలనీలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టంపై అవగాహన సదస్సు బి.నాగభూషణం అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కరవది సుబ్బారావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం తీసుకువచ్చినప్పటికీ నిధులను ఆ జనాభా ప్రకారం కేటాయించలేదని అన్నారు. ఈ చట్టంలో తెలంగాణ రాష్ట్రం మాదిరిగా 10 సంవత్సరాల కాలం పరిమితి తొలగించి సామాజిక న్యాయం అందేంతవరకు కొనసాగించాలని, కేటాయించిన నిధులు ఎస్సీ, ఎస్టీలకు నేరుగా ఉపయోగపడే పథకాలకు ఎక్కువ కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు మాట్లాడుతూ ఎస్టీ, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను వారికే ఉపయోగించాలని, విద్య, వైద్యం, దళిత గిరిజనుల భూముల అభివృద్ధి కోసం నిధుల కేటాయింపులు జరగాలన్నారు. ముఖ్య వక్తగా పాల్గొన్న పి.చిట్టిబాబు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల బడ్జెట్ కేటాయింపులలో జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించకపోవడం వలన దళిత ఆదివాసీలు సుమారు రూ.లక్ష 41 వేల కోట్లు నష్టపోయారని తెలిపారు. బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల వినియోగం మధ్య అసాధారణ తేడాలు ఉండటం వలన బడ్జెట్ విశ్వసనీయత కోల్పోయిందని తెలిపారు. దళిత ఆదివాసీలకు ఉపయోగపడే 230 పథకాలకు రూ.99 లక్షల లోపు నిధులు కేటాయించి, ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చని 32 పథకాలకు 500 కోట్ల నుంచి 965 కోట్ల వరకు నిధులు కేటాయించడం వలన ఎస్సీ, ఎస్టీ సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని తెలిపారు. చట్టం ప్రకారం వ్యక్తికి లేదా కుటుంబానికి లేదా సమూహానికి నేరుగా ఉపయోగపడే పథకాలను ప్రభుత్వం రూపొందించి వాటికి నిధులను కేటాయించాలని అన్నారు. సాంఘిక సంక్షేమ పూర్వ జాయింట్ డైరెక్టర్ ఎం.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగం, లబ్దిదారుల వివరాలు పారదర్శకత పెంపొందించే విధంగా వెబ్ సైట్‌లో పొందుపరచాలని, ఈ నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం కాలయ్య ప్రవేశపెట్టి తీర్మానాలను ఆమోదింప చేశారు. తీర్మానాలు ఇలా ఉన్నాయి... ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013కు సవరణలు తక్షణమే చేయాలి. సబ్ ప్లాన్ చట్టం అమలు చేయని వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలి. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే పథకాలను రూపొందించాలి. సబ్ ప్లాన్ కింద కేటాయింపులు పెంచాలి. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలను నిరోధించేందుకు నిధులు పెంచాలి. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.ధనశేఖర్, రాష్ట్ర అధ్యక్షులు భారతీయ సాహిత్య దళిత అకాడమీ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.కుమార్ రెడ్డి, గొడుగు చింత గోవిందయ్య, అల్లం మణి, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షులు సి.రత్నమ్మ, అడ్వకేట్ ఓ.మునెయ్య, డీహెచ్‌పీఎస్ నాయకులు డా.ఆర్.బలరాం, దేగా సుబ్రహ్మణ్యం, వెంకటగిరి, పి.బాలకృష్ణ, వై.జగన్నాథం, సుధా కోచింగ్ సంస్థల నిర్వాహకులు కె.సుధాకర్, భవన నిర్మాణ సంఘం నాయకులు ఎస్.రవి, టి.మురగయ్య, చంద్రబాబు, నాగరాజు పాల్గొన్నారు.

సహకార సేవలను సామాన్య ప్రజలకు విస్తరిద్దాం

విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): సహకార సేవలను సామాన్య ప్రజలకు విస్తరించాలని విశాఖపట్నం కో-ఆపరేటివ్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు సభ్యులకు పిలుపునిచ్చారు. ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ విజయవాడ బ్రాంచి సభ్యుల మహాసభ డైరెక్టర్ పొట్లూరి వెంకట రామారావు అధ్యక్షతన శుక్రవారం ఉదయం సాయి జ్యువెల్ కన్వెన్షన్ సెంటర్ హాలులో జరిగిన మహాసభకు ముఖ్యఅతిథిగా చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు హాజరై మాట్లాడారు. 2020, 22, 23 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులో రికార్డు స్థాయిలో 10,259 మంది నూతన సభ్యులు చేరారన్నారు. సహకార సంస్థలను ఆర్బీఐ విస్మరిస్తోందని, కో-ఆపరేటివ్ చట్టాలను మార్చేస్తూ పదవీ కాలాన్ని తగ్గిస్తున్నారన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా చట్టాన్ని మార్చే మూర్ఖులు ప్రభుత్వంలో ఉన్నారని విమర్శించారు. సహకార బ్యాంకుల నివేదికలు జూన్ 30లోగా అందచేయాలని, సభ్యుల అంగీకారం, ఆమోదం ఇంత తక్కువ సమయంలో ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సామాన్య ప్రజలు మాత్రమే బ్యాంకులలో దాచుకుంటున్నారని కోటీశ్వరులు దాచుకోవట్లేదని తెలిపారు. ఎనిమిది రెట్ల సంపాదనతో అదాని ఎలా పెరిగాడు? వీరికి చట్టాలు వర్తించవా అని ప్రశ్నించారు. ఆర్బీఐ... సహకార సంస్థల పైన రూ.55 లక్షలు పైగా పెనాల్టీలు వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ బ్రాంచ్ సామాన్యుల బ్యాంకుగా 2022-23 ఆర్థిక సంవత్సరానికి 7వేల కోట్ల ఆర్థిక కార్యకలాపాల మైలురాయి దాటిందన్నారు. సంస్థలోని పాలక వర్గం గత 30 ఏళ్లుగా ఏకగ్రీవంగా ఎన్నికవుతోందని, సాధారణ ప్రజలకు, కష్టజీవులకు, చిన్న వ్యాపారస్తులకు అండగా ఉంటూ వివిధ రకాల రుణాలు అందిస్తూ మన బ్యాంకు తోడ్పాటునిస్తోందన్నారు. సీనియర్ సిటిజన్లకు, రిటైరయిన ఉద్యోగులకు, వారు చేసిన డిపాజిట్లకు అధిక వడ్డీనిస్తూ భరోసా కల్పిస్తోందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా 21 మంది సభ్యులకు రూ.5,02,150 వైద్య ఖర్చులకోసం చెల్లించిందని తెలిపారు. 9 మంది సభ్యులు మరణించగా వారి కుటుంబ సభ్యులకు రూ.2,13,000 లు అందచేశారన్నారు.

రెండేళ్లు సమాజంపై పెను ప్రభావం చూపిన కోవిడ్ సంక్షోభం తర్వాత ఏకపక్షంగా బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టానికి చేసిన సవరణ ద్వారా రిజర్వు బ్యాంకుకు విస్తృత అధికారాలు కల్పించడంతో అర్బన్ బ్యాంకుల పురోగతికి తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ సీహెచ్‌వీఆర్ సుబ్రహ్మణ్యం తమ సందేశాలనిచ్చారు. బ్రాంచ్ మేనేజర్ క్రొవ్విడి కొండబాబు వార్షిక సంవత్సర నివేదికను ప్రవేశపెట్టారు. డైరెక్టర్లుగా పరుచూరి ప్రభుజయంత్ అజయ్ కుమార్, షేక్ మెహబూబ్ అజాం, ఉప్పల నాగ మల్లేశ్వరరావు, గరిమెళ్ళ నరసింహారావు కొనసాగుతుండగా, నార్ల మాలతిని తిరిగి డైరెక్టర్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో ఖాతాదారులు, డిపాజిటర్లు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంపాదకీయం

కెనడా నుంచి ఖాలిస్థానీ సెగ

బాబ్రీ మసీదును పడగొట్టడం లాంటి దుర్ఘటనలు జరిగిన తరవాత ఆ గాయాలు అంత త్వరగా మానవు. ఈ విధ్వంసాన్ని వ్యతిరేకించే వారు ఇప్పటికీ బాబ్రీ మసీదును కూల్చిన రోజైన డెసెంబర్ ఆరున ఏదో ఓ కార్యక్రమం నిర్వహిస్తారు. నిజానికి ఇది శోకదినం పాటించడమే. మహాత్మా గాంధీ హత్యను మనం ప్రతి సంవత్సరం జనవరి 30న గుర్తు చేసుకుంటూనే ఉంటాం. ప్రస్తుత రాజకీయ వాతావరణం గాంధీ హంతకులకు అనుకూలంగా ఉన్నందువల్ల హంతకుడైన గాడ్సేకు నివాళులు అర్పించేవారూ తయారయ్యారు. వీరి ఉన్మాదం గాడ్సేకు గుళ్లుకట్టే దాకా వెళ్లింది. సాక్షాత్తు పార్లమెంటు సభ్యురాలైన ఒక బీజేపీ నాయకురాలు జనవరి 30న మహాత్మా గాంధీ దిష్టి బొమ్మ ఏర్పాటుచేసి దాన్ని తుపాకితో కాల్చిన దృశ్యాలను ఎలా మరిచిపోగలం. దుర్ఘటనను గుర్తు చేసుకుని రెండు కన్నీటి బొట్లు రాల్చడం ఒక ఎత్తు అయితే ఆ దుర్ఘటనకు బాధ్యులైన వారిని సమర్థించేవారు సంబరాలు చేసుకోవడం మతోన్మాదానికి పరాకాష్ఠ. గత నాల్గవ తేదీన కెనడాలో సరిగ్గా ఇలాంటిదే జరిగింది. కెనడాలో సిక్కుల సంఖ్య ఎక్కువ. వారందరూ ఖాలిస్థానీయులేననడం కాదు గానీ స్వర్ణ దేవాలయంపై 1984లో సైనిక చర్యకు నిరసనగా ప్రతి ఏటా కెనడాలో ఒక ఉత్సవం లాంటిది నిర్వహిస్తారు.

ఈ సారి బ్రంప్టన్ నగరంలో అందులో ఇందిరా గాంధీని హత మార్చినందుకు సంబరాలు చేసుకుంటున్నట్టుగా ఒక శకటాన్ని ఊరేగించారు. ఆ శకటంపై ప్రదర్శించిన ఓ పోస్టర్‌లో ఇది "ప్రతీకారం" అని కూడా రాశారు. ఎంచుకున్న సందర్భం అమృత్‌సర్ స్వర్ణ దేవాలయం మీద సైనిక చర్యను నిరసించడమే. కానీ వారు తయారుచేసి ఊరేగించిన శకటం ఇందిరా గాంధీని హతమార్చగలిగినందుకు సంబరాలు చేసుకోవడానికి ఉద్దేశించింది. వారు ఖాలిస్థానీలు అంటున్నారు. కెనడాలో దాదాపు ఎనిమిది లక్షలమంది సిక్కులున్నారంటారు. పంజాబ్ వేర్పాటు వాద ఉద్యమ సందర్భంలో కెనడాలోని ఖాలిస్థానీ సానుభూతి పరులు సకల విధ సహాయమూ చేశారు. ఆయుధాలు కూడా సమ కూర్చారు. అమృత్‌సర్ స్వర్ణ దేవాలయం మీద చర్య తీసుకున్నందుకే ఇందిరాగాంధీని 1984 అక్టోబర్ 31 హతమార్చి ప్రతీకారం తీర్చుకున్నా మనేది వారి వాదన. భారత సైన్యాధిపతి జనరల్ అరుణ్ వైద్యను కూడా హతమార్చారు. ఇదీ ప్రతీకారంలో భాగమే. ఆపరేషన్ బ్లూ స్టార్ పేర అమృత్‌సర్ స్వర్ణదేవాలయం మీద సైనికదాడి జరిగి 39 ఏళ్లు కావస్తోంది.

ఇప్పటికీ తీవ్రవాద, వేర్పాటువాద భావాలున్న సిక్కుల ఆగ్రహ జ్వాలలు చల్లారనేలేదు. అందుకే ప్రతి ఏటా ఇందిరా గాంధీ హత్యను సంబరంగా పరిగణిస్తున్నారు. అమృత్‌సర్ స్వర్ణదేవాలయం మీద చర్య సరైందేనా కాదా అన్న చర్చ మొదటినుంచీ సాగుతూనే ఉంది. పంజాబ్‌లో తీవ్రవాదం పెచ్చరిల్లి పరిస్థితి చేయి దాటిపోతున్న దశలో సైనికచర్య అనివార్యం అని ఇందిరా గాంధీ భావించి ఉండొచ్చు. ఈ నిర్ణయం మంచి చెడ్డలను ఎంత కాలమైనా సాగదీయొచ్చు. కానీ ఒక హత్యను సంబరంగా మార్చడం తక్కువ దుర్మార్గం ఏమీ కాదు. కెనడాలో జరిగిన సంఘటన అక్కడున్న తీవ్రవాద సిక్కుల్లో గూడుకట్టుకున్న భారత వ్యతిరేకతకు సంకేతం. ఖాలీస్థానీల నిరసన ఏదో ఒక స్థాయిలో ఆస్ట్రేలియా, అమెరికా, బ్రిటన్, యూరప్ లోని కొన్ని ప్రాంతాలలో కూడా జరుగుతూనే ఉన్నాయి.

ఇందిరా గాంధీని హతమార్చినందుకు సంబరాలు చేసుకోవడం సహజంగానే మన దేశంలో అలజడికి దారి తీస్తుంది. అనేక రాజకీయ పార్టీలు, కెనడా క్షమాపణ చెప్పాలంటున్నాయి. ఇలాంటి ఉదంతాలు కొనసాగుతూనే ఉంటే కెనడాలో వేర్పాటువాద శక్తులు బలం పుంజు కుంటాయి. గతానుభవాన్నిబట్టి చూస్తే ఇది మనదేశంలో కూడా ఖాలిస్థానీ ఉద్యమానికి కొత్త ఊపిరులూదుతుంది. ఇటీవలే అమృత్ పాల్ సింగ్ సంధు అనే సిక్కు మతగురువు మళ్లీ ఖాలిస్థానీ నినాదాల సాయంతో నానా అల్లకల్లోలం సృష్టించాడు. ఆయనను పట్టుకోవడానికి నానా అగచాట్లూ పడవలసి వచ్చింది. ఆయనను పంజాబ్ వారసుల అధ్యక్షుడిగా కూడా నియమించారు. సార్వభౌమాధికారం గల సిక్కు రాజ్యం (ఖాలిస్థాన్) కావాలని ఆయన కోరారు. ఆయనకు పాక్ గూఢచార సంస్థ ఐ.ఎస్.ఐ. మద్దతు ఉందంటున్నారు. ఆయుధాలు పోగేయడంతో పాటు ఆనంద్ పూర్ ఖాల్సా ఫౌజ్ అని సాయుధ దళాన్ని కూడా ఏర్పాటు చేశారు. అచ్చు మరో బింద్రన్ వాలేలా వ్యవహరించారు. అమృత్ పాల్ సింగ్ అనుచరులు రెండు గురుద్వారాల మీద దాడి చేశారు. ఆయన అనుచరుడిని పోలీసులు అరెస్టుచేస్తే పోలీస్ స్టేషన్ మీద అత్యాధునిక ఆయుధాలతో విరుచుకుపడ్డారు. అమృత్‌పాల్ మోగాలోని ఓ గురుద్వారాలో తలదాచుకున్నాడు. చివరకు పోలీసులు చుట్టుముడితే గత ఏప్రిల్ 23న లొంగి పోయాడు. ఇలాంటి వ్యక్తులు, సంస్థలు మళ్లీ ఖాలిస్థానీ ఉద్యమాన్ని రగుల్కొల్పడానికి ప్రయత్నించడం కొనసాగుతూనే ఉంది. కెనడాలో జరిగిన సంఘటనలు ఇలాంటి వారికి ప్రేరణ కలిగిస్తాయి. అదీ కాక రెండు దేశాల మధ్య సంబంధాలు బెడిసిపోతాయి. కెనడాలో జరిగిన సంఘటన లాంటివి మనకే కాదు కెనడాకు కూడా తలనొప్పిగా పరిణమిస్తాయి.

విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ బ్రంప్టన్ సంఘటనపై కెనడా ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. అయితే ఓటు బ్యాంకు రాజకీయాల వల్లే కెనడా ప్రభుత్వం ఖాలిస్థానీలను వెనకేసుకొస్తోందని శివశంకర్ వ్యాఖ్యానించడం హ్రస్వదృష్టి కాక అవాస్తవం కూడా. అయితే కెనడా ప్రభుత్వం తమ దేశంలో ఉన్న సిక్కులు భారత్‌కు వ్యతిరేకంగా ఆగడాలకు పాల్పడితే ఎన్నడూ కఠినమైన చర్య తీసుకున్న దాఖలాలు లేవు. ఏ ప్రయోజనం కోసమైనా తీవ్రవాదులను వెనకేసుకొస్తే వారికే అంతిమంగా ప్రమాదం. భారత్‌కు తీరని నష్టం ఎటూ తప్పదు. 1985లో ఈ తీవ్రవాదులు ఏర్ఇండియా విమానాన్ని కూల్చేశారు. భారత-కెనడా దేశాల మధ్య ఇటీవలి కాలంలో సఖ్యత అంతంత మాత్రమే. 2020లో మన దేశంలో దిల్లీ పొలిమేరల్లో రైతులు సుదీర్ఘ కాలం ఉద్యమించినప్పుడు కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ప్రతికూల వ్యాఖ్యలు చేశారు. దీనివల్ల కెనడాతో మనకు కొన్ని నెలలపాటు లాంఛన ప్రాయమైన సంబంధాలు కూడా లేకుండా పోయాయి. ప్రస్తుత వివాదం సామరస్యంగా పరిష్కారం కాకపోతే పరిస్థితి మరింత క్షీణించ వచ్చు. ద్వైపాక్షిక సంబంధాలకు విఘాతం కలుగుతుంది.

భావ ప్రకటనా స్వేచ్ఛను కెనడా ఎంత గౌరవించినా ఇందిరా గాంధీని హతమార్చినందుకు సంబరాలు చేసుకునే వారిని చూసీ చూడనట్టు వదిలేయడం రెండు దేశాల దౌత్య సంబంధాలకు విఘాతం కల్గిస్తుంది. మోదీ ప్రభుత్వం దౌత్య మార్గాలలో ఈ బెడద లేకుండా చేయడానికి ఉపకరించే వ్యూహ రచన చేయాలి. జి-20 సమావేశానికి హాజరు కావడానికి వచ్చే సెప్టెంబర్‌లో అనేక దేశాల నాయకులు దిల్లీ రావాల్సి ఉంది. అప్పుడు వీరందరితో ఈ ఉదంతాన్ని ప్రస్తావించి పునరావృతం కాకుండా ఉండే మార్గం ఏమిటో ఆలోచించాలి. కెనడాలో ఖాలిస్థానీ ఛాయలు ఇప్పటికీ బలంగా ఉండడం ఓ హెచ్చరిక.

హక్కుల కాపరి బాలగోపాల్

అసాధారణ మేధస్సు, నిరంతర అధ్యయనం, విస్తృత విషయ పరిజ్ఞానం, వాగ్ధాటి, రచనాకౌశలం, ఆత్మీయత, ఆచరణశీలత గలిగిన మేధావి బాల గోపాల్. కశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా తలెత్తిన హక్కుల ఉల్లంఘనలపై ఆయన ఉద్యమించారు. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హక్కుల ఉద్యమాలకు ఆయన దశ-దిశని నిర్దేశించి వెన్నుదన్నుగా నిలిచారు. బాలగోపాల్ మధ్య తరగతి బ్రాహ్మణ పండిత కుటుంబంలో 1952, జూన్ 10 నాడు నాగమణి, పార్థనాథశర్మ దంపతులకు జన్మించారు. ఆయన నిరంతరం పేద, దళిత, గిరిజన, మైనారిటీ, బలహీన వర్గాల అభ్యున్నతికి తన కార్యక్షేత్రం ద్వారా కృషి చేశారు. ఆయన గణితశాస్త్ర విద్యార్థి అయినసూ చరిత్ర, తత్వశాస్త్రం, అర్థశాస్త్రాలను విస్తృతంగా అధ్యయనంచేసి సమాజ పోకడలని సునిశితంగా పరిశీలించారు. హక్కుల ఉద్యమ దిశగా ఆయన తన ప్రస్థానాన్ని కొనసాగించారు.

బాలగోపాల్ వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎం.ఎస్సీ అప్లైడ్ మాథ్స్‌ని అభ్యసించి అక్కడే డాక్టరేట్ చేస్తున్న క్రమంలో అక్కడ జరుగు తున్న రాడికల్ విద్యార్థి సంఘం కార్యక్రమాలను సునిశితంగా పరిశీలించారు. రాడికల్ విద్యార్థి సంఘం నాయకులు సూరపనేని జనార్ధన్ ఎన్‌కౌంటర్, జన్ను చిన్నాలు హత్యా సంఘటనల తర్వాత ప్రజలకోసం ఒక క్రియాశీల కార్యకర్తగా పనిచేయాలని బాలగోపాల్ బలంగా నిర్ణయించుకొని 1981లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో చేరారు. వరంగల్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు లెక్కల మేధావిగా ఉన్న బాలగోపాల్‌ని హక్కుల కార్యకర్తగా తీర్చిదిద్దాయి. 1983లో ఖమ్మంలో జరిగిన పౌర హక్కుల రాష్ట్ర రెండవ మహాసభలో బాలగోపాల్ ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో తాను చేస్తున్న గణితశాస్త్ర అధ్యాపక ఉద్యోగం ఉద్యమాలకు అడ్డు వస్తుందని భావించి ఆయన ఆ ఉద్యోగాన్ని సైతం తృణీకరించి పూర్తికాలపు హక్కుల కార్యకర్తగా కొనసాగారు. బాలగోపాల్ పౌర హక్కుల సంఘంలో గుణాత్మక మార్పులు తీసుకువచ్చి హక్కుల ఉద్యమంలో నూతన ఒరవడులతో ఉద్యమించారు. కొంతకాలం తర్వాత తీర్చిదిద్దిన పౌర హక్కుల సంఘం నుండి ఆయన వైదొలిగి 1998, అక్టోబర్ 11 నాడు 'మానవ హక్కుల వేదిక'ను స్థాపించారు.

బాలగోపాల్ పౌర హక్కుల సంఘంలో పనిచేస్తున్న సమయంలో బెంగళూర్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న వివేకానంద న్యాయ కళాశాలలో ఎల్.ఎల్.బి. న్యాయవాద డిగ్రీని అభ్యసించి 1997లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా తన పేరుని నమోదు చేయించుకున్నారు. ఆయన న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించక పూర్వమే చట్టాలు, న్యాయశాస్త్రంలో ఉన్న ఆనుపానాలను, తర్కాన్ని సమగ్రంగా అవగాహన చేసుకోవడంలో నిష్ణాతులుగా పేరు గడించారు. కొన్ని విషయాలలో సీనియర్ న్యాయవాదులు కె.జి.కన్నాబిరాన్ దగ్గర సలహాలు తీసుకొని ఆ ప్రకారం ముందుకు సాగారు.

బాలగోపాల్ ప్రధానంగా హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన కేసులలో వాటివల్ల నష్టపోయిన బాధితుల పక్షం నిలబడి వారి తరపున కోర్టులలో వాదించే అవకాశం ఉన్నంత మేరకు వాదించి చట్ట ఫలితాలను వారికి అందించారు. ఆయన ఉచితంగా చాలా కేసులు వాదించారు. అతి తక్కువ రుసుములు తీసుకుని వాదించే న్యాయవాదులలో బాలగోపాల్ అరుదైన న్యాయవాది. కేసులతో వచ్చిన వారికి గొప్ప నమ్మకాన్ని కల్పిస్తూ కేసులని తప్పకుండా గెలుస్తామన్న ఆశావహ దృక్పథాన్ని ఆయన కల్పించేవారు. దళితులు, గిరిజనులు, కార్మికులు, ఉద్యోగులు, భూవివాదాలకు సంబంధించిన అన్ని కేసులను ఆయన వాదించారు. అలాగే లేబర్ కోర్ట్, ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ , సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, లేబర్ కమిషన్ ఆఫీసుల కేసులను కూడా ఆయన వాదించారు. నక్సలైట్లకు సంబంధించి అనేక హెబియస్ కార్పస్ పిటీషన్లు వేసి వాదించారు.

చుండూరు హత్యాకాండ కేసులో బాలగోపాల్ బాధిత దళితులకు అండగా నిలబడి హైకోర్టులో బలమైన వాదనలు వినిపించి దళిత హక్కులకు బాసటగా నడిచారు. అదేవిధంగా 'షెడ్యూల్డ్ ట్రైబల్స్ అండ్ అదర్ ట్రెడిషన్ ఫారెస్ట్ డ్వెల్లర్స్ యాక్ట్'ని అమలు చేయడం కోసం గిరిజనులు చేసిన పోరాటానికి బాలగోపాల్ బాసటగా నిలిచి కోర్టులో ఆ చట్టాన్ని అమలు చేయించగలిగారు. ఈ చట్టం ద్వారా గిరిజనులకు 2009లో భూములు పంపిణీ చేశారు.

బాలగోపాల్ చేసిన ముఖ్యమైన కేసులలో అత్యంత ముఖ్యమైన కేసు ఎన్‌కౌంటర్‌ల కేసు. 'పోలీసులకు ప్రాణం తీసే హక్కు లేదు అని, పోలీసులు ఎన్‌కౌంటర్‌ల నుండి తప్పించు కోవడానికి వీలులేదు అని, పోలీసులపై కూడా కేసులు పెట్టవచ్చు' అని రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానంలో బాలగోపాల్ అత్యున్నతమైన బలమైన వాదనలు వినిపించి 'పోలీసులపై కూడా న్యాయ విచారణని జరిపించాలి' అనే తీర్పుని బాలగోపాల్ తీసుకురాగలిగారు. ఆ తీర్పునివిని ఆయన కోర్టు హాల్ నుండి బయటకు వస్తూ మొట్ట మొదటిసారిగా చాలా సంతోషకరంగా కనిపించిన ఆ సందర్భాన్ని ఆయన జీవితంలో అత్యంత ప్రముఖమైన సందర్భంగా పేర్కొనవచ్చు. ఆ తీర్పు రావడం వెనకాల బాలగోపాల్ 30 ఏళ్ల నిర్విరామ కృషిఉంది. అనేక హక్కుల సంఘాలతో మిళితమైన ఈ కేసులో బాలగోపాల్‌తో పాటు కె.జి.కన్నాబిరాన్, బొజ్జా తారకం తదితరులు తమ వాదనలు వినిపించారు.

హక్కుల నిరాదారణకు గురైనప్పుడు ప్రజలు చైతన్యంతో గొంతెత్తి ప్రశ్నించినప్పుడు హక్కులు అమలు అవుతాయని బాలగోపాల్ విశ్వసించారు. న్యాయాన్ని పొందేందుకు ఉద్యమించాల్సిందేనని ఆయన నిర్దేశించారు. హక్కుల అమలుకోసం ఒకవైపు హక్కుల ఉద్యమాల్లో ఉద్యమిస్తూ మరోవైపు వాటికి సమాంతరంగా న్యాయవాదిగా నిరంతరం బాధితుల పక్షాన నిలబడి ఎన్నో కేసులు వాదించి 'అత్యంత నిబద్ధత గల న్యాయవాది'గా చరిత్ర సృష్టించి ప్రజా హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న బాలగోపాల్ 2009, అక్టోబర్ 8 నాడు మరణించినసూ 'చెరగని హక్కుల స్ఫూర్తి'గా వెలుగొందుతున్నారు.

(నేడు బాలగోపాల్ జయంతి సందర్భంగా)

జె.జె.సి.పి. బాబూరావు, రీసెర్చ్ స్కాలర్, సెల్: 94933 19690

"ఆమె శరీరం.. ఆమె ఇష్టం..."

చక్రవాకం - ముక్కాముల చక్రధర్

ఈ వ్యాఖ్యలు చేసింది కేరళ హైకోర్టు. కొందరు బుద్ధి జీవులకు ఈ వ్యాఖ్యలు పైకి పెద్ద విషయంగా కనిపించకపోవచ్చు. కాని కాసింత లోతుగా ఆలోచిస్తే స్త్రీల పట్ల మనం ఎంత దారుణంగా, నీచంగా ఆలోచిస్తున్నామో....వ్యవహరిస్తున్నామో అర్థం అవుతుంది. దేశానికి స్వాతంత్ర్య వచ్చిన ఏడున్నర దశబ్దాల తర్వాత స్త్రీకి తన శరీరంపై సర్వహక్కులు ఆమెకే ఉన్నాయని ఓ అత్యున్నత న్యాయస్థానం చెప్పే స్థాయికి మనం ఉన్నామంటే మహిళల పట్ల మన వివక్ష ఎంత దారుణంగా ఉందో తెలుస్తుంది. "స్త్రీలను గౌరవించడం మన సాంప్రదాయం... వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం" అంటూ దశాబ్దాలుగా ఆర్టీసీ బస్సుల్లో రాస్తున్నారంటే సిగ్గుపడాల్సింది పురుషులేగా. ఆకాశంలో సగం సరే.... భూమి మీద మహిళల సంగతేంటనేదే నా ప్రశ్న.

ఇంతకీ కేరళ హైకోర్టు ఇంత తీవ్రంగా ఎందుకు వ్యాఖ్యానిం చిందంటే....కేరళలో సామాజిక కార్యకర్త రెహనా ఫాతిమా పడుకుని ఉండగా ఆమె కుమారుడు, కుమార్తె పెయింటింగ్ వేస్తున్న ఫొటోని సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఆ ఫొటోకు ఫాతిమా పెట్టిన కామెంట్ "పురుషుడి శరీర పైభాగం నగ్నంగా ఉన్నా దాన్ని లైంగిక దృష్టితో చూడని ఈ సమాజం మహిళ విషయంలో మాత్రం ఎందుకు చూస్తారు" అని. అంతే దీని మీద సోషల్ మీడియాలో పోస్టులే కాదు...ఏకంగా ఫాతిమాపై కేసులు కూడా పెట్టేశారు, ఈ కేసుల నుంచి విముక్తి కల్పించండి మహాప్రభో అంటూ ఫాతిమా కేరళ హైకోర్టును ఆశ్రయించింది. ఇది ప్రస్తుత సందర్భం.

ఐదు దశాబ్దాల క్రితమే మన రచయిత గుడిపాటి వెంకటచలం "స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి.... అనే సంగతి గుర్తించని ఈ దేశానికి నేను రాసే సంగతులు అర్థం అవుతాయా?" అని సందేహించాడు. చలం తెలుగులో చెప్తే... ఇదే మాటను కేరళ హైకోర్టు మళయాళంలో చెప్పింది. భాషలు వేరు కాని భావం ఒక్కటే. అంతే కాదు....రాష్ట్రాలు వేరు కాని... మహిళల బాధలు ఒక్కటే అని కూడా హైకోర్టు వ్యాఖ్యలు రుజువు చేశాయి.

ఆనాటి చలం... నేటి కేరళ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను బట్టి మహిళల జీవితాలు వారి చేతుల్లో లేనట్లుగానే వారి శరీరాలు, ఇష్టాలు, ప్రేమలు, వ్యతిరేకతలు, ఆనందాలు, విషాదాలు ఏవీ.. ఏవీ కూడా ఆమె చేతుల్లో లేకుండా పోయాయి. ఆ మధ్య అమితాబచ్చన్ నటించిన పింక్ అనే సినిమా వచ్చింది. ఈ సినిమాలో కూడా ఇదే చెప్పారు. "మహిళ అంగీకారం లేకుండా ఆమెను తాకరాదు. ఎవరైనా సరే. చివరకు ఒక వయసు వచ్చిన తర్వాత తండ్రైనా". కొత్త పాయింట్. దేశవ్యాప్తంగా సినిమా సూపర్ హిట్. దీనికి పైత్యాన్ని జోడించి తెలుగులో వకీల్ సాబ్ అనే సినిమా తీసారు. పైత్యం సంగతి సరే... ఈ సినిమా కూడా హిట్. తెర ముందు రెండు గంటల పాటు మహిళలపై ఎనలేని గౌరవం కురిపించిన ప్రేక్షకులు హాలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కేటాయించిన సీట్లలోనే కూర్చుని ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

దేశంలో ప్రతినిత్యం అనేకానేక మంచి పనులు జరుగుతున్నాయి. వాటి నుంచి స్ఫూర్తి పొందామని చెబుతున్నవారు కానరావడం లేదు. దారుణ హింసకు... అదీ మహిళలపై జరుగుతున్న, జరుపుతున్న మారణకాండకు మాత్రం వారసులు పుట్టుకొచ్చేస్తున్నారు. శ్రద్ధవాకర్ అనే చిట్టితల్లిని చంపి ముక్కలు చేసిన ఓ దుర్మార్గుడు ముంబైలో అలాంటి ఘటనకే స్ఫూర్తి అయ్యాడు. ముంబైలో నీచుడు మనోజ్ సానే చేతిలో అతని సహచరి సరస్వతీ వైద్య ఇలాగే బలైంది. దేశం వెలిగిపోతోంది. ప్రపంచ దేశాలన్నీ మనవైపే చూస్తున్నాయి....సార్... ఇక్కడ మహిళలకు రక్షణ కరువైంది కొత్త పార్లమెంటు భవనాలు... సచివాలయాలు... దేదీప్యమానంగా కాంతులీనుతున్నాయి. ఏలికలారా.... స్త్రీ శరీరాలను ముక్కలు చేసేస్తున్నారు... అగ్రరాజ్యాలు మన అభివృద్ధి వైపు చూస్తున్నాయి.... అన్నట్లు... దిశ చట్టం వైపు కూడా అవే కళ్లు చూస్తున్నాయి...

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

చిరస్మరణీయుడు.. పైడిమర్రి

ఐ-మెయిల్



నిత్యం కోట్లాదిమంది విద్యార్థుల గొంతులలో ప్రతిధ్వనించే "భారతదేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు" అంటూ జాతీయ ప్రతిజ్ఞను రచించిన పైడిమర్రి వెంకట సుబ్బారావు గురించి చాలా మందికి 2011సంవత్సరం వరకు తెలియదు. కొంతమంది రచయితలు, అభ్యుదయ వాదులు, స్వచ్ఛంద సంస్థల నిరంతర కృషి ఫలితంగా 2015-16 విద్యా సంవత్సరం నుంచి ఆయన పేరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో ప్రతిజ్ఞ వద్ద ముద్రించడం ప్రారంభం అయింది. ప్రతిజ్ఞ అంటేనే పైడిమర్రి. పైడిమరి అంటే అనే ప్రతిజ్ఞ. ఇది జగమెరిగిన సత్యం. ప్రతిజ్ఞ ప్రభావం ప్రతి భారతీయ పౌరుని బాల్య దశలో కీలక పాత్ర నిర్వహిస్తూ వస్తుంది. మాతృభూమి పట్ల, గురువుల పట్ల, పౌరుల పట్ల మన కర్తవ్యం ఏమిటో ప్రతిజ్ఞ గుర్తు చేస్తుంది. దేశభక్తిని, నైతిక విలువలను మన మస్తిష్కాల్లో స్థిర నివాసం ఏర్పడేటట్లు చేసిన ప్రతిజ్ఞ పాత్ర ఎవరూ మర్చిపోరు. ప్రతి విద్యార్థి నడవడికలో ప్రతిజ్ఞ భూమిక సదాస్మరణీయం. అటువంటి ప్రాముఖ్యత కలిగిన ప్రతిజ్ఞను భావితరాలకు సైతం వారసత్వ సంపదగా అందించిన పైడిమర్రి వెంకట సుబ్బారావు 107 వ జయంతి సందర్భంగా ప్రాతఃస్మరణీయులు. మహనీయుల జీవితాలను నేటితరం అధ్యయనం చేసి ప్రతిజ్ఞ ఉద్దేశాలను అవగాహన చేసుకుంటే ప్రజాస్వామ్య విలువలను, భిన్నత్వంలోని ఏకత్వమును కాపాడుకోవచ్చును. మనమంతా భారతీయులమని ఘనంగా ఎలుగెత్తి చాటడానికి ప్రతిజ్ఞ ఒకటి చాలు. భౌతిక జీవితానికి, నైతిక జీవితానికి మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు నైతిక జీవితానికి ప్రాధాన్యత ఇవ్వమని ప్రతిజ్ఞ చెబుతుంది. జాతీయ భావం, దేశభక్తి భావన అభివృద్ధి చెందటానికి ప్రతిజ్ఞ ఎంతగానో దోహదంచేస్తుంది. భారతీయులలో ఆత్మస్థైర్యం నింపే ఆయుధం, బాధ్యతలను గుర్తు చేసే మధుర జ్ఞాపకం ప్రతిజ్ఞ. దీనిని తూచా తప్పకుండా పాటిస్తే ఇంతకు మించిన దేశభక్తి మరొకటి ఉండదేమో. దేశం పట్ల పౌరుల బాధ్యతలను ప్రతిజ్ఞ తెలియజేసినంతగా మరొకటి ఉండదు కూడా. మాతృ భూమి పట్ల మనం అనుసరించాల్సిన విధానాలు, కర్తవ్యాలు, బాధ్యతలు మొదలైన వాటి గురించి వివరించేదే భారతదేశము నా మాతృభూమి ప్రతిజ్ఞ. ఎంతో మహోన్నతమైన, అనంతమైన, అమూల్యమైన భావ పదవీచికలను భారతదేశమంతా గుభాళింపజేసిన దేశభక్తుడు, సాధుస్వభావి పైడిమర్రి.

రేపాక రఘునందన్, అరసం కార్యదర్శి, ఎన్టీఆర్ జిల్లా

తెలుగునాట రాజకీయ విమర్శలు

ఈ నడుమ తెలుగు నాట రాజకీయములు జనరంజకముగానున్నవి. తెల్లారినది మొదలు నాయకులు కలహప్రియులై విరాజిల్లుతున్నారు. వాదనా పటిమా దురంధురులై భాసిల్లుతున్నారు. తొడలు గొట్టుచున్నారు. జబ్బలు జరుచుచున్నారు. మీసాలు దువ్వుతున్నారు. కొర కొర జూచుచున్నారు.... కాలు దువ్వుతున్నారు. తాత్కాలికోన్మాదులగుచున్నారు. చెప్పవలెనన్న అసలు రాత్రి నిద్రించునదెక్కడ? రెప్ప వేయకుండిరి. కన్ను మూయకుండిరి. కోడి ఎప్పుడు కూయునో అన్న ధ్యాసే గాని ప్రక్కలో పడతి ఊసేలేదు. ప్రతి రాత్రి జాగరణే. ప్రతి రాత్రి శివరాత్రే. సూర్యోదయమైనది మొదలు కలహమునకు టెంకాయ గొట్టుదురు. దేవునికి అగరుపుల్లలైనా వెలిగించుట లేదు. నైవేద్యము బెట్టుటలేదు. కర్పూర హారతి కనుల కద్దుకొనునది లేదు. ఇంటికి అగ్గి తగిలినట్లు బయటపడి దూరదర్శన్‌లలో ప్రత్యక్షముగుచున్నారు.

అందు నిత్యము మా విమర్శ - మీ జవాబు కార్యక్రమము నిర్వహింతురు. నయనానందకరముగను, శ్రావణానందకరముగను నున్నదని చెప్పుటచే ఆసక్తుడనై కూర్చు చుంటిని. ఒక వ్యాఖ్యాత దినపత్రిక చేబూని వచ్చెను. నిద్రకరువై, అల్పాహారము బరువై, సంసార లంపటమును తాత్కాలికముగా త్యజించి వచ్చిన అతిథులకు, గుడ్లార్పకుండా జూచుచున్న ప్రేక్షకులకు ఇదే ఆహ్వానమని జెప్పి ఇట్లు జదివెను " మీ నాయకునికి అన్న ప్రాసనము, అక్షరాభ్యాసము బాగుగా జరిగినదిగాని విద్యాభ్యాసము సరి లేదని, బాషోఛ్చారణ దోషములచే సతమత మగుచున్నాడని, వ్యవహారిక భాషను పరిహాసక భాష జేసి బహుళ ప్రచారమొనర్చుచున్నాడని" విమర్శ వచ్చినది. మీరేమి సమాధాన మిత్తురని ప్రశ్నింప ఒక అతిథి గొంతు సవరించుకొని ఇట్లు జెప్పెను. "రాజకీయములకు, చదువునకు సంబంధ మేమున్నది? రాత్రులు తిరుగమని గుడ్లగూబకు ఎవరు జెప్పినారు? చెట్టు లెక్కమని వానరములకు ఎవరు నేర్పినారు? రంగులు మార్చమని ఊసర వెల్లులకు ఎవరు తర్ఫీదు నిచ్చినారు? ప్రకృతి సిద్ధముగా, వారసత్వ సంపదగా వచ్చునదే రాజకీయము. దానికి చదువునకు సంబంధమేమి? బండెడు బుస్తకములు జదివిన బండెద్దు బ్రతుకేగదా. దస్త్రములు బట్టి మంత్రులు వెంట, నాయకుల వెంట దిరగవలసినదేగదా. రాజకీయ జ్ఞానము ముందు సాధారణవిద్య విలువెంత? పుత్తడికి, ఇత్తడికి బేధమున్నదే. ఇంత అజ్ఞానముతో మాటలాడుచున్నారేమి? ఆంగ్లముతో పాటు తెలుగు కూడా పరిపరి విధముల విస్తరించుచున్నది. భగవదను గ్రహముతో కొన్ని పదములుచ్చరణ అసంభవమైన వచ్చిన భాషయే మాట్లాడ వలయును. కొత్త పదములు బలుకక తప్పదు. మీరు సాధించిన ఘన కార్యమేమున్నది? పరిష్కారమొనర్చిన సమస్యలేమి? చేసిన రాచ కార్యములేమి యని సాగదీసి ధీర్ఘము తీయుట కంటే 'ఏమి పీకినారు''



యని ఒక లఘు పదమునుపయోగించిన ఎంత సుఖము... ఎంత సౌలభ్యముగా నున్నది. వాడుక భాష దెచ్చిన గురజాడ, గిడుగులను కూడా మిారటులనే దిట్టినారే... తిట్టకున్న మీనోరూరకుండదా? మరొక్క మారు మా నాయకుని పల్లెత్తు మాటదెన మూతిమీద గొట్టుదమని హెచ్చరించెను. మీరు గొట్టిన మేమూరుకుందుమా? రెండు దవడలు పగులగొట్టమా అని వేరొకరు అనిన' ఆవనూనె, జొన్నరొట్టె, రాగిముద్ద తిన్న శరీరము... ఒక్కటి గొట్టిన జత్తువ'ని తిరిగి అనెను. 'నీ చేతిలో చచ్చుటకేనా మాయమ్మ కన్నది. నాలుగెకరములకు నారు విసరిన చెయ్యి... ఒక్క దెబ్బకు తిన్నగ పైకి పోదువ'ని వేరొకరు యనెను. మీరిద్దరు కొట్టుకొనిన కొట్లాట పెట్టినని చెప్పి నన్ను కొట్టులో బెట్టెదరని వ్యాఖ్యాత వారికి సర్దిచెప్పి మరొకపత్రిక చదివెను.

"మీ నాయకులు సానుల సాంగత్యము నెరుపుతున్నారని జూద గృహములకు బోవుచున్నారని, రక్షక భటుల రక్షణలో దుష్కార్యములు చేయుచున్నార'ను విమర్శకు సమాధాన మేమియని ప్రశ్నింప ఆరున్నర శృతిలో కొట్లాడిన మరొక అతిథి శృతి సవరించి ఇట్లనెను. మేము రాజ్యాంగ బద్ధముగ, శాసన నియమాను సారముగా పాలన సాగింతుమని ప్రమాణము చేసినాము. అది సర్వులకు విదితమే. మేము జేసిన ప్రమాణమునకు మేము గూర్చున్న ఛానల్ వారు కూడా బహుళ ప్రాచుర్యమొనర్చినారు. గనుక వారు కూడా సాక్షులని భావించుచున్నాను. మేము గద్దెనెక్కు కార్యక్రమము ప్రత్యక్ష ప్రసారమొనర్చుటకు నిలువు కాళ్ళపై నిలుచుండి, నడ్డివంచి, మోకాళ్ళపై గూర్చుండి, అవసరార్థము కన్ను లొట్టచేసి మీరు పడ్డ అవస్థలు, చేసిన విన్యాసములు, వేసిన భంగిమలు జూచితిమి. అందులకు కృతజ్ఞతా పూర్వక అభినందనలు. మీ కర్తవ్యము మీరు సక్రమముగా నిర్వర్తించితిరి. అటుల ఎవరిపని వారు జేసిన విమర్శలుండవు. గాడిద పని గాడిద... కుక్క పని కుక్క చేయవలెనన్న కథ మీరు చదివియే ఉందురు. చదవకున్న చెప్పుటకు ఇది సమయము కాదు, సమయము మించిపోవును, కాలయాపన చేసితినని, సమాధానమీయ కుండా ఎగవైచితినని, పంచె ఎగగట్టి పారిపోతినని మరల ఇదే పత్రికలో రేపు విమర్శింతురు. అందుకే విషయము లోనికి వచ్చెదను. విడుపు కాగితములు లేకుండా రెండు మూడు పెండ్లిళ్ళు చేసుకొనుట నేరము. సానుల సాంగత్యము నేరము కాదని న్యాయ స్థానముల జెప్పినవి. వ్యభిచార వృత్తికి లైసెన్సులిచ్చుచున్నారు. వారి అవాంఛిత సంతానమునకు విద్యా బోధన గరుపుచున్నారు. ఎవరికి బుట్టి నావురా.. ఎక్కెక్కి ఏడ్చుచున్నావన్న బాధ నుండి వారి పిల్లలకు విముక్తి కల్పించుచున్నారు. వసతి గృహములేర్పాటు జేయుచున్నారు. అన్ని వృత్తుల వలెనే వారిని ప్రోత్సహించుచున్నారు. వారి జీవనమునకు తోడ్పడుచున్నారు. వారు తారాడు వీధులకు ప్రత్యేక పేరిడుచున్నారు. విటులు తటపటాయించక పోవుటకు ఖాకీ దుస్తులు వారిని నిషేధించుచున్నారు. సుఖ వ్యాధులు తగులకుండా నివారణా సాధనము లేర్పాటు జేయుచున్నారు. ప్రభుత్వములన్ని విధముల ప్రోత్సహించుచుండ వారి నాదుకొనుటకు మేము జేసిన కృషి అపరాధ మెట్లగును? చట్ట బద్ధమైన వ్యవహారమును చట్ట ఉల్లంఘనగా ఏల భావించుచున్నారు. ప్రపంచమునకు తలమానికమైన అమెరికా దేశాధినేతలే సానుల సాంగత్యము బట్టినారని పత్రికలలో చదవలేదా? చదువరు... చదివినా చదువనట్లుందురు. అదియే కపటము. అదియే ద్వంద్వగుణము. అదియే పక్షపాతము. ఇల్లు గుల్లయిన మా ఇల్లాలు జూచుకొనును. మీరు చింతించవలదు.

మరియొక్క విషయము.... ఇక జూదములలో పందెము కాసినది నిజము. మరి మీరేమి జేయుచుంటిరి మేము పందెము కాసిన మీరు పై పందెములు కాయుచున్నారే. కోడి పందెములలో మేము కాకి మాది... కాకి మాది యనుచుండ మీదట దేగ మాది... దేగ మాది యని పందెమొడ్డు చున్నారే. గుండాటలో మేము రెండు మీద కాసిన మీరు మూడు మీద కాయుచున్నారే. మేము వెయ్యి పెట్టిన మీరు వెయ్యిన్నొక్కటి పెట్టుచున్నారే. మీరు జేసినది తప్పుగాకున్న మేము జేసినది తప్పుఎట్లగును? అని తిరుగ ప్రశ్నించెను. ఇంకనూ ఏమోమో జెప్పుచుండ సమయము ముగిసినది. ఇంటికి పోవుదని జెప్పి యాంకర్ పోయెను.. నేనునూ విశ్రమించితిని.

(పానుగంటి వారికి కృతజ్ఞతలతో)

ఎస్.జి.కె.

హరియాణా సంకీర్ణంలో లుకలుకలు

- **బీజేపీ నేత విప్లవ్ దేవ్‌ను కలిసిన నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు**
- **మిత్రపక్షం జేజేపీతో విభేదాలు తీవ్రం**

న్యూఢిల్లీ : బీజేపీ, దాని మిత్రపక్షమైన జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) మధ్య విభేదాల నడుమ ఇక్కడ హరియాణాకు చెందిన నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ విప్లవ్ కుమార్ దేవ్‌ను కలిశారు. గురువారం జరిగిన సమావేశంలో హరియాణా ఎమ్మెల్యేలు ధరమ్ పాల్ గోండర్, రాకేష్ దౌల్తాబాద్, రణధీర్ సింగ్, సోమవీర్ సంగ్వాన్ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారని దేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 'డబుల్ ఇంజన్' ప్రభుత్వంలో రాష్ట్ర పురోగతికి తమ పార్టీ ఎటువంటి అవకాశాన్ని వదలడం లేదని బీజేపీ నాయకుడు అన్నారు. హరియాణాలో మెజారిటీ రాకపోవడంతో 2019లో బీజేపీ జేజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జేజేపీ నేత దుష్యంత్ చౌతాలా ఉప ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ప్రాంతీయ పార్టీ కూడా ప్రభుత్వంలో చేరడంతో మద్దతు ఇవ్వడం ద్వారా జేజేపీ... బీజేపీకి అనుకూలంగా లేదని దేవ్ చెప్పడంతో రెండు పార్టీల నాయకులు ఇటీవల ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు.

2024 అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలా వద్దా అనే విషయంలో రెండు పార్టీలు నిబద్ధతతో లేవు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో పార్టీ సొంతంగా పోరాడాలని కొందరు బీజేపీ నేతలు సూచించడంపై ఇటీవల చౌతాలాను వ్యాఖ్యానించమని అడిగినప్పుడు, 'భవిష్యత్తులో ఏమి జరుగుతుందో... దానిని అంచనా వేయడానికి నేను జ్యోతిష్యుడిని కాను' అని అన్నారు. 'మనం సంస్థను 10 సీట్లకు పరిమితం చేయాలా? అస్సలు కుదరదు. బీజేపీ కేవలం 40 సీట్లపై పోటీ చేస్తుందా? అస్సలు కుదరదు. రెండు పార్టీలు 90 సీట్లకు సిద్ధమవుతున్నాయి' అని చౌతాలా అప్పుడు చెప్పారు.

ఈవీఎంల తనిఖీని ప్రారంభించిన ఈసీ

న్యూఢిల్లీ : 2024 లోక్‌సభ ఎన్నికలు, ఈ ఏడాది చివరిలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఈవీఎంలు, పేపర్‌ట్రైల్ యంత్రాల 'మొదటి దశ తనిఖీ' ని దశలవారీగా ప్రారంభించినట్లు ఆ వర్గాలు శుక్రవారం తెలిపాయి. 'మాక్ పోల్స్' మొదటి దశ తనిఖీ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియలో భాగమని వారు చెప్పారు. 'ఇది పాన్-ఇండియా కసరత్తు. కేరళలోని అన్ని నియోజకవర్గాలతో సహా దశలవారీగా దేశవ్యాప్తంగా ఎఫ్ఎల్‌సీ జరుగుతుంది' అని ఎన్నికల సంఘం కార్యనిర్వాహకుడు తెలిపారు. మార్చిలో సూరత్‌లోని సెషన్స్ కోర్టు క్రిమినల్ పరువు నష్టం కేసులో దోషిగా తేల్చిన తర్వాత కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడంతో ఖాళీ అయిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో జరుగుతున్న మాక్ పోల్‌పై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. 'ఇటువంటి కసరత్తుల కోసం ఈసీ క్యాలెండర్‌ను జారీ చేస్తుంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు అనుసరించాల్సిన కచ్చితమైన సూచనలు ఉన్నాయి' అని కార్యకర్త వివరించారు. రాజస్థాన్, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్‌తో పాటు ఉప ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ, పార్లమెంటరీ స్థానాల్లో కూడా ఎఫ్ఎల్‌సీలు జరుగుతాయని కార్యకర్త సూచించారు. ప్రస్తుతం, వయనాడ్, పూణే, చంద్రపూర్ (మహారాష్ట్ర), ఘాజీపూర్ (ఉత్తరప్రదేశ్), అంబాలా (హరియాణా) లోక్‌సభ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. దోషిగా నిర్ధారించి, శిక్షపై స్టే విధించాలని కోరుతూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ గుజరాత్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఎఫ్ఎల్‌సీ సమయంలో సమయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, పరికరాలను తయారు చేసే రెండు ప్రభుత్వ రంగ సంస్థలు బీఈఎల్, ఈసీఐఎల్ ఇంజనీర్లచే మెకానికల్ లోపాల కోసం తనిఖీ చేయబడతాయి. లోపభూయిష్ట యంత్రాలు మరమ్మతు లేదా భర్తీ కోసం తయారీదారులకు తిరిగి ఇస్తారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రెండు యంత్రాలను తనిఖీ చేసేందుకు మాక్ పోల్ కూడా నిర్వహిస్తారు.

రూ. 2,000 నోట్ల మార్పిడిపై అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కృతి

న్యూఢిల్లీ : ఎలాంటి అభ్యర్థన పత్రం, గుర్తింపు కార్డు లేకుండా రూ.2 వేల నగదు నోట్లను మార్చుకునేందుకు వీలు కల్పించే నోటిఫికేషన్లను సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్‌పై అత్యవసర విచారణను సుప్రీం కోర్టు శుక్రవారం తిరస్కరించింది. న్యాయమూర్తులు అనిరుద్ధ బోస్, రాజేష్ బిందాల్‌తో కూడిన వెకేషన్ బెంచ్ రిజిస్ట్రీ దాఖలు చేసిన నివేదికను పరిశీలించి, ఈ విషయంలో అత్యవసరం లేదని పేర్కొంది. వేసవి సెలవుల తర్వాత ఈ అంశాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ముందు ఉంచాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఇంతటి ముఖ్యమైన అంశాన్ని అత్యున్నత న్యాయస్థానం చేపట్టకపోవడం చాలా దురదృష్టకరమని పిటిషనర్ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ వాదనలు వినిపించారు. ఇది కోర్టు అని, బహిరంగ వేదిక కాదని, ఈ వ్యవహారాన్ని ఎక్కడికైనా ముగించాలని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ అంశంపై అత్యవసర విచారణకు సుప్రీం కోర్టు నిరాకరించడం ఇది రెండోసారి. జూన్ 1న నోటిఫికేషన్‌లను సవాలు చేస్తూ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసర విచారణ కోసం జాబితా చేయడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. వేసవి విరామ సమయంలో అటువంటి అభ్యర్థనలను చేపట్టబోమని తెలిపింది. రూ.2 వేల నోట్లను నేరస్తులు. ఉగ్రవాదులు ఎలాంటి అభ్యర్థన పత్రం, ఆధార్ గుర్తింపు రుజువు లేకుండానే మార్చుకుంటున్నారని న్యాయవాది గతంలో వాదనలు వినిపించారు.

జీవా భార్య 'ముందస్తు బెయిల్'పై వెంటనే విచారించక్కర్లేదు: సుప్రీం

న్యూఢిల్లీ: లక్నో కోర్టు ఆవరణలో హత్యకు గురైన గ్యాంగ్‌స్టర్ సంజీవ్ మహేశ్వరి జీవా భార్య ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీంకోరు తిరస్కరించింది. జీవా అంత్యక్రియలు ఇప్పటికే జరిగాయని, ఈ విషయంలో అత్యవసరం లేదని న్యాయమూర్తులు అనిరుద్ధ బోస్, రాజేష్ బిందాల్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ పేర్కొంది. 'పిటిషనర్ పాయల్ మహేశ్వరి, భర్త అంత్యక్రియలు జరగనున్న నేపథ్యంలో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. భర్త అంత్యక్రియలకు హాజరైనప్పుడు పోలీసులు ఎటువంటి బలవంతపు చర్య తీసుకోకుండా రక్షణ కోరారు' అని బెంచ్ పేర్కొంది. 'అంత్యక్రియలు ఇప్పటికే జరిగాయి... పిటిషనర్ దానికి హాజరుకాలేదు... ఆమె కుమారుడు అంత్యక్రియలు నిర్వహించారని యూపీ అదనపు అడ్వకేట్ జనరల్ మాకు తెలియజేశారు. ఆమె అంత్యక్రియలకు హాజరైనట్లయితే పిటిషనర్‌పై ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోబడవని పోలీసులు నిర్ధారించారని ఏఏజీ వెల్లడించారు. అందువల్ల, సెలవుల్లో ఈ విషయాన్ని జాబితా చేయాల్సిన అవసరం లేదు' అని బెంచ్ వెల్లడించింది. కాగా తన భర్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరిన పాయల్ మహేశ్వరిపై రాష్ట్రం ఎలాంటి చర్యలు తీసుకోబోదని యూపీ అదనపు అడ్వకేట్ జనరల్ గరిమా ప్రసాద్ కోర్టుకు హామీ ఇచ్చారు. లక్నో జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న జీవా(48)ని ఓ కేసులో విచారణ నిమిత్తం లక్నో కోర్టుకు తీసుకొచ్చినప్పుడు న్యాయవాదుల్లాగా కోర్టులో ప్రవేశించిన దుండగులు కాల్చి చంపారు.

విచారణకు కంగారెందుకు?

మణిపూర్‌లో ఇంటర్నెట్ సేవల నిలిపివేతపై సుప్రీం

న్యూఢిల్లీ: జాతుల హింస ప్రజ్వరిల్లిన మణిపూర్ రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు శు క్రవారం తిరస్కరించింది, ఈ విషయాన్ని హైకోర్టు పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. 'హైకోర్టు ఈ విషయాన్ని విచారిస్తోంది. ఎందుకు డూప్లికేట్ చేస్తున్నారు? రెగ్యులర్ బెంచ్ ముందుకు రానివ్వండి' అని న్యాయమూర్తులు అనిరుద్ధ బోస్, రాజేష్ బిందాల్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ స్పష్టం చేసింది. ఇద్దరు మణిపురి నివాసితులు చోంగ్థామ్ విక్టర్‌సింగ్, మయేంగ్బమ్ జేమ్స్ తరపు న్యాయవాది షాదన్ ఫర్సత్... ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాల్సిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో ఇప్పటికే 35 రోజులకు పైగా ఇంటర్నెట్ సేవలు నిలిపివేసినట్లు చెప్పారు. మణిపూర్ ప్రభుత్వ తరపు న్యాయవాది మాట్లాడుతూ హైకోర్టు ఇప్పటికే కొన్ని విషయాలపై విచారణ చేపట్టినందున ఈ కేసును అత్యవసరంగా విచారించే అవసరం లేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నెట్ ఆపివేయడం వల్ల తమ జీవితాలు, జీవనోపాధి తీవ్రంగా ప్రభావితమైందని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇంటర్నెట్ ఆపివేయడం వల్ల పిటిషనర్లు, వారి కుటుంబాలపై గణనీయ రీతిలో ఆర్థిక, సామాజిక, మానసిక ప్రభావం పడిందని పిటిషన్ పేర్కొంది. తమ పిల్లలను పాఠశాలకు పంపలేకపోతున్నామని, బ్యాంకుల నుండి నిధులు పొందలేకపోతున్నామని, ఖాతాదారుల నుండి చెల్లింపులు స్వీకరించడం, జీతాలు పంపిణీ చేయడం, ఇ-మెయిల్ లేదా వాట్సాప్ ద్వారా కమ్యూనికేట్ చేయలేకపోతున్నారని పిటిషనర్లు పేర్కొన్నారు. దాదాపు నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నెట్ సదుపాయం పూర్తిగా ఆగిపోయిందని, ఇది ప్రజల దైనందిన జీవితానికి, వారి ప్రాథమిక హక్కులకు తీవ్రంగా హాని కలిగిస్తోందని చోంగ్థం విక్టర్ సింగ్ పీటీఐకి తెలిపారు. మణిపూర్‌లో మే 3న ఇంటర్నెట్‌పై నిషేధం విధించారు. ఇది ఇంకా కొనసాగుతోంది.

సామాజిక మాధ్యమాల ద్వారా

విపక్ష నేతల్ని కించపరిస్తే కఠిన చర్యలు

అజిత్ పవార్ డిమాండ్

న్యూఢిల్లీ : సోషల్ మీడియా ద్వారా ప్రతిపక్ష నేతల పరువు తీయడానికి ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఒకరిపై మరొకరు పరుష పదజాలం వాడడం మానుకోవాలని ఎన్‌సీపీ సీనియర్ నేత అజిత్ పవార్ శుక్రవారం కోరారు. పూణేలో విలేకరులతో మాట్లాడిన పవార్, ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్‌కు సోషల్ మీడియాలో ప్రాణహాని ఉందంటూ వచ్చిన బెదిరింపుపై ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను సంప్రదించడానికి ప్రయత్నించానని చెప్పారు. 'ఎవరి ఖాతా అని తెలుసుకున్నాం. ఆ వ్యక్తి బీజేపీ కార్యకర్త అని.. ఆయన నిజంగా బీజేపీ కార్యకర్తేనా.. లేక ఆయన పార్టీ చెప్పాలా.. అనే విషయం మాకు తెలియడం లేదు. సైద్ధాంతికంగా పోరాడాలి' అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరికి భావ ప్రకటన స్వేచ్ఛ ఉంది కానీ ఎందుకు దుర్వినియోగం చేశారన్నారు. ఏ రాజకీయ నాయకుడిపైనా పరువు నష్టం కలిగించేలా రాసే హక్కు వారికి ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. తాను షిండేతో సంప్రదించేందుకు ప్రయత్నించానని, అయితే సీఎం పర్యటనలో ఉన్నారని చెప్పారని అజిత్ పవార్ తెలిపారు. 'నేను ఉప ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను సంప్రదించడానికి ప్రయత్నించాను, కానీ అది సాధించలేకపోయాను. నేను మళ్లీ ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తాను' అని అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు కూడా అయిన పవార్ మాట్లాడుతూ బెదిరింపు జారీ చేసిన వ్యక్తి ఎవరితోనైనా సంప్రదింపులు జరుపుతున్నాడా, ఆ వ్యక్తులు బెదిరింపు సందేశాన్ని పంపమని అడిగారా అని తెలుసుకోవడానికి తనిఖీ చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ చర్యకు పాల్పడిన వారిని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర పార్టీలకు చెందిన నాయకులను పరువు తీయడం, ప్రజల్లో వారి ప్రతిష్ఠను దిగజార్చడం వంటి చర్యలపై పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. 'నేను దానిని ఖండిస్తున్నాను' అని పేర్కొంటూ, అదే తప్పు చేయవద్దని ఎన్‌సీపీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. శరద్ పవార్‌పై బీజేపీ నాయకుడు నీలేష్ రాణే చేసిన ఔరంగజేబు వ్యాఖ్య గురించి అడిగిన ప్రశ్నకు, కొన్ని పార్టీలకు చెందిన కొంతమంది అసభ్య పదజాలం ఉపయోగిస్తున్నారని అన్నారు. 'పార్టీల సీనియర్ నాయకత్వం వారిని ఈ విధంగా మాట్లాడవద్దని కోరాలి. సైద్ధాంతిక విభేదాలను చూపండి. మా పార్టీతో సహా అన్ని పార్టీల గురించి మాట్లాడుతున్నాను' అని అన్నారు. రాజకీయ పార్టీల అధికార ప్రతినిధులు బురదజల్లడం తగదని ఎన్‌సీపీ నేత అన్నారు. ఇలాగే కొనసాగితే రాష్ట్రానికి అవమానం తప్పదని అన్నారు. ప్రజలు అభ్యంతరకరమైన సోషల్ మీడియా స్టేటస్‌లను ఉంచడం వల్ల గందరగోళం, హింసకు దారితీసే సంఘటనల గురించి అడిగిన ప్రశ్నకు పవార్, అటువంటి పరిస్థితులను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కఠినమైన చట్టాన్ని రూపొందించాలని కోరారు. థానే జిల్లాలోని ఒక ఫ్లాట్‌లో ఒక మహిళను నరికి, ఉడకబెట్టిన శరీర భాగాలను కనుగొనడం గురించి మాట్లాడుతూ 'ఢిల్లీలో కూడా ఇలాంటి సంఘటన జరిగింది. అలాంటి కేసులను త్వరగా విచారించాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఈ వ్యక్తులకు మరణశిక్ష విధించాలి' అని కోరారు.

బహనగ హైస్కూలు కూల్చివేత

కొత్త నిర్మాణానికి ఒడిశా సీఎం అంగీకారం

మోడల్ స్కూల్‌గా మార్చే ప్రతిపాదన

భువనేశ్వర్: ఒడిశాలో చోటుచేసుకున్న ఘోర రైలు ప్రమాదంలో మరణించిన వారిని ఉంచేందుకు వినియోగమైన బహనగ హైస్కూల్ భవనాన్ని పీడబ్ల్యూడీ అధికారులు కూల్చివేశారు. స్కూలు నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యుల సమక్షంలో శుక్రవారం కూల్చివేత కొనసాగింది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటన మృతులను ఈ స్కూలు భవనంలో రెండ్రోజులు ఉంచారు. శవగారంగా మారిన పాఠశాలకు వచ్చేందుకు పిల్లలు, వారి తల్లిదండ్రులు భయపడుతున్నారు. తరగతిగదుల్లో శవాలు ఉంచిన ఫొటోలు, వీడియోలు చూసి విద్యార్థులు వణికిపోయారు. వారి మదిలో నుంచి ఆ భయానక దృశ్యాలు పోవడం లేదు. దీంతో తమ పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు ఇష్టపడం లేదు. అటు పిల్లలూ స్కూలుకు వెళ్లమని అంటున్నారు. దీనిని కూల్చివేసి కొత్త బడి కడితే భయం లేకుండా పిల్లలు చదువుకోగలరన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. అంతేకాకుండా ఈ స్కూలు భవనం పాతబడిపోయింది. దీంతో స్కూలు భవనాన్ని కూల్చివేయడమే సరైనదని ఎస్ఎంసీ పేర్కొంది. స్థానికులు కూడా దీనినే కోరుకోవడంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం సీనియర్ ప్రభుత్వ అధికారులు, సీఎస్‌తో చర్చించి కొత్త స్కూలు నిర్మాణానికి అంగీకరించారు. బహనగ హైస్కూలును మోడల్ స్కూల్‌గా మార్చాలని, ఆధునిక వసతులు కల్పించాలని, గ్రంథాలయం, ప్రయోగశాల, డిజిటల్ తరగతిగదులు ఉండేలా ప్రతిపాదించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానికుల్లో భయాన్ని పోగొట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్కూల్, మాస్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి ఎస్.అవస్తీ వెల్లడించారు.

దుర్గ్-పూరి ఎక్స్‌ప్రెస్ రైలు కోచ్‌లో మంటలు

భువనేశ్వర్: దుర్గ్-పూరి ఎక్స్‌ప్రెస్ రైలు కోచ్‌లో స్వల్పంగా మంటలు వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఒడిశాలోని నౌపడా జిల్లాలో జరిగిన ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ ఎటువంటి హాని జరగలేదని ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ధృవీకరించారు. బ్రేక్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య వల్ల బ్రేక్ ప్యాడ్‌లకు మంటలు అంటుకున్నాయి. అయితే మంటలు బ్రేక్ ప్యాడ్‌లకే పరిమితమయ్యాయి. దీని వల్ల ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. కాగా కోచ్ నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు పరుగులు తీశారు. దుర్గ్-పూరి ఎక్స్‌ప్రెస్ గురువారం సాయంత్రం ఖరియార్ రోడ్ స్టేషన్‌కు చేరుకోగానే రైలులోని బి3 కోచ్‌లో పొగలు కనిపించాయని అధికారులు వెల్లడించారు. రైల్వే అధికారులు గంటలోపే సమస్యను సరిచేయడంతో రైలు రాత్రి 11గంటలకు స్టేషన్ నుంచి బయలుదేరిందని చెప్పారు. భోగి నుంచి పొగలు రావడంతో చాలామంది ప్రయాణికులు రైలు నుంచి బయటకు పరుగులు తీశారు. ఆ తర్వాత ప్రమాద తీవ్రత అంతగా లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో జరిగిన ఘోర రైలు దుర్ఘటనలో 288 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

ఒడిశా విద్యామంత్రిపై వేటు

భువనేశ్వర్: ఒడిశా ఉన్నత విద్యాశాఖమంత్రి రోహిత్ పూజారిని మంత్రివర్గం నుంచి తొలగించారు. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మంత్రి వర్గం పూజారీ తొలగిస్తూ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్... గవర్నర్ గణేశిలాల్‌కు సిఫార్సు చేశారని, ఆ శాఖను ఆహార సరఫరా శాఖ మంత్రి అటాను ఎస్.నాయక్‌కు కేటాయించారని పేర్కొన్నాయి. దీనిపై వ్యాఖ్యానించేందుకు పూజారి వెంటనే అందుబాటులోకి రాలేదు. రాయఖోల్ అసెంబ్లీ నియోకవర్గం నుంచి ఎన్నికైన పూజారి గత ఏడాది జూన్‌లో మంత్రివర్గంలో చేరారు. మే 22 నుంచి జూన్ 2 వరకు అన్ని శాఖల పనితీరును సీఎం నవీన్ పట్నాయక్ సమీక్షించారు. ఈ సమీక్షలో ఉన్నత విద్యాశాఖ పనితీరు అట్టడుగున ఉన్నట్లు తేలడంతో మంత్రివర్గం నుంచి పూజారిని తప్పించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయవర్గాలు పేర్కొన్నాయి.

బీహార్‌లో ఈడీ దాడులు

న్యూఢిల్లీ: బీహార్ ప్రభుత్వం రూ.250 కోట్ల ఆదాయాన్ని కోల్పోవడానికి దారితీసిన కొన్ని కంపెనీల అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో దాడులు నిర్వహించి సుమారు రూ.7.5 కోట్ల మేర నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం తెలిపింది. పాట్నా, జార్ఖండ్‌లోని ధన్‌బాద్, హజారీబాగ్‌లోని 27 ప్రాంతాల్లో, కోల్‌కతాలోని బ్రాడ్‌సన్ కమోడిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే రెండు సంస్థలు, వాటి డైరెక్టర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఇతర అసోసియేట్‌ల ప్రాంగణాల్లో జూన్ 5న సోదాలు జరిపినట్లు ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది. నిందితులపై బీహార్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్లలో దాఖలైన ఎఫ్ఐఆర్‌లను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఈడీ మనీలాండరింగ్ కేసును నమోదు చేసింది. మైనింగ్ అథారిటీ జారీ చేసిన డిపార్ట్‌మెంటల్ ప్రీ-పెయిడ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇ-చలాన్‌ను ఉపయోగించకుండా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి, విక్రయించిన నిందితులపై బీహార్ గనుల శాఖ నుండి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ఈడీ తెలిపింది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ. 250 కోట్ల మేర ఆదాయ నష్టం వాటిల్లింది. ఈడీ నిర్వహించిన సోదాల్లో దాదాపు రూ.1.5 కోట్ల నగదు, రూ.11 కోట్ల ఆస్తి పత్రాలు, రూ. 6 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ రశీదులు స్వాధీనం చేసుకోగా, 60 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు తెలిపింది.

మణిపూర్‌లో ఆయుధాలు, యుద్ధ సామగ్రి స్వాధీనం

కోల్‌కతా: మణిపూర్‌లో భద్రతా బలగాలు సంయుక్తంగా జరిపిన సోదాలలో కనీసం 35 ఆయుధాలు, యుద్ధ సంబంధ సామాను స్వాధీనం చేసుకున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. మణిపూర్ రాజధాని ఇంఫాల్‌ను అసోం, దేశంలోని ఇతర ప్రాంతాలతో కలిపే జాతీయ రహదారి 37 మీదుగా మణిపూర్‌కు, అక్కడి నుంచి బయటికి అవసరమైన వస్తువులను స్వేచ్ఛగా తరలించడం కోసం తనిఖీలు నిర్వహించామని ఆయన చెప్పారు. కొండలు , లోయలున్న ప్రాంతంలో గురువారం ఉమ్మడి గాలింపులో వివిధ రకాలైన 35 ఆయుధాలు, మందుగుండు సామగ్రి, యుద్ధ సంబంధ సామగ్రి స్వాధీనం చేసుకున్నాయని పేర్కొన్నారు. నెల రోజుల పాటు సాగుతున్న జాతి కలహాల వల్ల ప్రభావితమైన ప్రజల్లో విశ్వాసం పెంపొందించే చర్యలను భద్రతాదళాలు చేపట్టాయని తెలిపారు. మొదటి రోజు బుధవారం చేపట్టిన తనిఖీలలో భద్రతా దళాలు 29 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇందులో ఎక్కువగా ఆటోమేటిక్, మోర్టార్, హ్యాండ్ గ్రెనేడ్‌లు, చిన్న ఆయుధాలు, మందుగుండు సామగ్రి, యుద్ధ సంబంధ సామాగ్రి ఉంది. జాతుల ఘర్షణ నేపథ్యంలో మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు దాదాపు 10,000 మంది ఆర్మీ, అసోం రైఫిల్స్ దళాలను రాష్ట్రంలో మోహరించారు.

మహిళా లాయర్లకు లేని టాయిలెట్లు

మద్రాసు హైకోర్టు రిజిస్ట్రీ నివేదిక కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: తమిళనాడు, ఊటీలోని నీల్గిరీస్ కోర్టు కాంపెక్స్‌లో మహిళా న్యాయవాదులకు టాయిలెట్లు లేకపోవడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై మద్రాసు హైకోర్టు నుంచి సమగ్ర నివేదికను కోరింది. ఇందుకోసం తీసుకున్న చర్యలేమిటో వివరిస్తూ నివేదిక ఉండాలని మద్రాసు హైకోర్టు రిజిస్ట్రీకి సూచించింది. ఇంతకుముందు రిజిస్ట్రార్ జనరల్ ఇచ్చిన నివేదికలో కొత్త కోర్టులో మహిళా న్యాయవాదులకున్న వసతుల గురించి పూర్తి వివరాలు లేకపోవడాన్ని న్యాయస్థానం ప్రస్తావించింది.

ఆదివారానికి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని, తదుపరి విచారణ సోమవారం జరుగుతుందని రిజిస్ట్రీకి జస్టిస్ అనిరుద్దా బోస్, జస్టిస్ రాజేశ్ బిందల్‌తో కూడిన ద్విసభ్య వెకేషన్ ధర్మాసనం తెలిపింది. ఊటీలో కొత్తగా ప్రారంభించిన కోర్టులో మహిళా న్యాయవాదులకు కనీస వసతులు లేకపోవడంపై నీల్గిరీస్ మహిళా న్యాయవాదుల సమాఖ్య చేసిన ఫిర్యాదును సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. నీల్గిరీస్ కోర్టు కాంపెక్స్‌లో మహిళా నాయవాదులకు టాయిలెట్లు లేవని, వారికి కనీస వసతులు కల్పించాలని కోరుతూ జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్ రేఖాశర్మ ఈనెల 7వ తేదీన మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ పంపారు.

మోసం కేసులో మహారాష్ట్ర సహకార సంఘం చైర్మన్ ఆస్తులు రూ.60 కోట్లు జప్తు

న్యూఢిల్లీ : దాదాపు రూ.200 కోట్ల పెట్టుబడిదారుల నిధులను మళ్లించి మోసం చేశారనే ఆరోపణలకు సంబంధించిన కేసులో మహారాష్ట్రకు చెందిన సహకార సంఘం చైర్మన్‌కు చెందిన రూ.60 కోట్లకు పైగా విలువైన ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద జప్తు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం తెలిపింది. గిల్బర్ట్ బాప్టిస్ట్‌కు చెందిన ఫ్లాట్‌లు, దుకాణాలు, భూములు వంటి స్థిరాస్తులను జప్తు చేయడానికి మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు దర్యాప్తు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.60.44 కోట్లు అని, బాప్టిస్ట్‌తో పాటు అవి అతని కుటుంబ సభ్యులు, సహాయకులు, అతని నియంత్రణలో ఉన్న సంస్థలకు చెందినవని పేర్కొంది. ఈ కేసులో గతంలో ఈడీ అరెస్టు చేసి, ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న బాప్టిస్ట్, మార్సెలిన్ బాప్టిస్ట్‌తో కలిసి 2010లో మలైకా మల్టీ-స్టేట్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ (ఎంఎంసీసీఎస్) ని స్థాపించారు. మనీలాండరింగ్ కేసు నిందితులపై మహారాష్ట్ర పోలీసులు దాఖలు చేసిన రెండు ఛార్జ్ షీట్ల ఆధారంగా ఉంది. గిల్బర్ట్ బాప్టిస్ట్ సహకార సంఘంలో అనేక మంది 'నకిలీ' డైరెక్టర్లను నియమించారని ఈడీ ఆరోపించింది. 'సొసైటీని గిల్బర్ట్ బాప్టిస్ట్ 'వన్ మాన్ షో' గా నడిపారు. ఇతర సభ్యులందరూ రోజువారీ కార్యకలాపాల కోసం అతని సూచనలను పాటిస్తున్నారు. పెట్టుబడిదారులు తమ పొదుపులను అనేక పథకాలలో డిపాజిట్ చేయమని, గొప్ప రాబడుల వాగ్దానాలతో క్రమపద్ధతిలో ఆకర్షించబడ్డారు. 'అయితే, అమాయక పెట్టుబడిదారుల డిపాజిట్లను సురక్షితమైన వ్యాపారాలు లేదా సాధనాల్లో పెట్టుబడి పెట్టడానికి బదులుగా, గిల్బర్ట్ బాప్టిస్ట్ తన స్వంత వ్యాపార వెంచర్లకు ఎక్కువ నిధులను మళ్లించాడు' అని దర్యాప్తు సంస్థ పేర్కొంది. మలైకా అప్లయెన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంఏపీఎల్), యసోమా ఇండస్ట్రీస్, యసోమా వెడ్డింగ్ చీరలు, మలైకా స్టార్‌సిటీ ప్రాజెక్టు మొదలైన వాటి పేర్లతో అతని నుంచి వచ్చిన పెట్టుబడులతో వివిధ వ్యాపారాలను ప్రారంభించాడని పేర్కొంది. ఎంఎంసీసీఎస్ ఆర్థిక ఆడిటర్లు గిల్బర్ట్ బాప్టిస్ట్, అతని సహాయకులు 'విస్మరించిన' అనేక 'అక్రమాలను' ఎత్తి చూపారని దర్యాప్తులో ఈడీ కనుగొంది. రుణాలను మంజూరు చేయడానికి ఎటువంటి వివేకవంతమైన ఆర్థిక నిబంధనలను అనుసరించలేదు. అతని వ్యాపారాలలో కూడా అదే నిర్లక్ష్య విధానాన్ని అనుసరించారని ఆరోపించింది. గిల్బర్ట్ బాప్టిస్ట్ తన పేరు మీద, అతని కుటుంబం, అసోసియేట్‌లు, వ్యాపారాల పేరిట ఆస్తులను సృష్టించేందుకు నిధులను 'మళ్లించారు' అని ఈడీ గుర్తించింది. 'అతని వ్యాపార సంస్థలు డబ్బును కోల్పోయాయి. వెంటనే ఎంఎంసీసీఎస్ ఖాతాలు ఎన్‌పీఏ (నిరర్థక ఆస్తులు)గా మారాయి. ఫలితంగా వేలాది మంది అమాయక పెట్టుబడిదారులు నష్టపోయారు. గిల్బర్ట్ బాప్టిస్ట్ చేసిన మోసం కారణంగా రూ.200 కోట్లకు పైగా డిపాజిట్లు పోయినట్లు అంచనా' అని ఈడీ పేర్కొంది.

కబ్జాదారుల నుంచి

దళితుల భూములు కాపాడాలి

సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: పశ్చిమ గోదావరి జిల్లా చించినాడ గ్రామంలో దళిత, బలహీనవర్గాల వారిని విచక్షణారహితంగా కొట్టి, దాడులకు పాల్పడిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి, దళితులకు చెందిన భూములను కబ్జాదారుల నుంచి కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం లేఖ రాశారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో సుమారు 400 కుటుంబాల దళిత, బలహీన వర్గాల వారు సొసైటీగా ఏర్పడి, గత 60 సంవత్సరాల నుంచి గోదావరి పెరుగులంకలోని 70 ఎకరాల భూమిని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. దళితులకు చెందిన పెరుగులంక భూములలోని మట్టిని అక్రమంగా తరలించేందుకు వైసీపీకి చెందిన స్థానిక నాయకులు ప్రయత్నించగా, ఆ భూములను సాగు చేసుకుంటున్న దళిత, బలహీనవర్గాల వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే ఆర్డర్ పొందారన్నారు. దీంతో నరసాపురం శాసనసభ్యులు ముదునూరి ప్రసాద్‌రాజు అండతో స్థానిక వైసీపీ నాయకులు మరింత రెచ్చిపోయి, దళితులకు స్టే ఇచ్చిన భూములలో అడ్డుగోలుగా రోడ్లు వేసి; రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల సహకారంతో ఆయా భూములకు

సరిహద్దుల్లో పెద్ద ఎత్తున అక్రమంగా మట్టి త్రవ్వకాలు చేస్తూ జగనన్న కాలనీలకు ఆ మట్టిని తరలిస్తున్నామని చెబుతున్నారని పేర్కొన్నారు. వాస్తవానికి ఆ మట్టిని మేడపాడులోని ఇటుక బట్టీలకు తరలిస్తుండగా ఆయా లారీలను దళిత వర్గాలు అడ్డుకుని ఆందోళన చేపట్టారని తెలిపారు. గోదావరికి, దళితుల భూములకి మధ్య వున్న మట్టిని తవ్వేస్తే, గోదావరి వరదలో దళితుల భూమి మునిగిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

దళిత, బలహీన వర్గాల భూములను కబ్జాచేసి, వారి జీవనోపాధికి దెబ్బకొట్టేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నించడం దుర్మార్గం అన్నారు. ఈ నెల 6న బాధిత దళితులకు మద్దతుగా వచ్చిన శాసనసభ్యులు నిమ్మల రామానాయుడును అక్రమంగా అరెస్టు చేయగా, ఇదేమని ప్రశ్నించినందుకు పల్లేరు శ్రీనివాస్, తెన్నేటి స్టాలిన్, సంపతరావు, కానేటి బాలరాజు, ముత్యాలు, బత్తులు విజయ్ కుమార్, బాలరాజు అనే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారిని పోలీసులు జుట్టు, గొంతు పట్టుకొని, పీక నులుముతూ, పోలీసు వ్యాన్‌లోకి బలవంతంగా ఎక్కించి, అసభ్య పదజాలంతో దళితులను కులం పేరుతో దూషిస్తూ కొట్టారని వివరించారు. లాఠీలతో పోలీసులు కొట్టగా వారందరికీ తీవ్ర గాయాలయ్యాయనీ, దళితులకు అండగా వచ్చిన వారి అక్కా చెల్లెళ్లను కూడా మగ పోలీసులు బండబూతులు తిడుతూ, కనీసం ఆడవారనే కనికరం లేకుండా ఛాతీలపై తాకుతూ, చీరలు లాగి అవమానించి, పాలకొల్లుకు దూరంగా ఉన్న తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్ర గాయాలతో చికిత్స జరిగి నప్పటికీ, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు గానీ, పోలీసువారు గానీ వీరి నుంచి ఎటువంటి స్టేట్మెంట్స్ రికార్డు చేయకపోవడం గమనార్హం అన్నారు. నరసాపురం డీఎస్పీ, పాలకొల్లు రూరల్ సీఐ, యలమంచిలి ఎస్ఐ, పాలకొల్లు టౌన్ ఎస్ఐ, తదితర పోలీస్‌స్టేషన్ల నుండి వచ్చిన పోలీసు సిబ్బంది దళిత, బలహీనవర్గాలపై లాఠీచార్జి, దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు దళితులు, మహిళలు అని కూడా చూడకుండా అత్యంత అరాచకంగా దాడులకు పాల్పడుతూ, అక్రమంగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేశారు.

తక్షణమే చించినాడ గ్రామంలో పెరుగులంక భూముల కబ్జాకు ప్రయత్నిస్తున్న వైసీపీ నాయకులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దళిత, బలహీనవర్గాలను, మహిళలను కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన పోలీసు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెరుగులంకలో దళితులు వారి భూములను స్వేచ్ఛగా సాగుచేసుకునేందుకు తగు చర్యలు చేపట్ట వలసిందిగా కోరారు.

విద్యుత్ చార్జీల పెంపుపై 15న సీపీఐ రౌండ్‌టేబుల్

విశాలాంధ్ర-విజయవాడ: పెంచిన విద్యుత్ చార్జీలతో పాటు ట్రూఅప్ చార్జీలను తగ్గించాలని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించింది. ఇదే డిమాండ్‌తో ఈ నెల15న రౌండ్‌టేబుల్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. 15వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ, దాసరిభవన్‌లో రౌండ్‌టేబుల్ జరుగుతుందని తెలిపింది. వైసీపీ ప్రభుత్వం పదేపదే ప్రజలపై విద్యుత్ చార్జీల పెనుభారాన్ని మోపుతుందని విమర్శించింది. అధికారంలోకొస్తే 200 యూనిట్లలోపు వినియోగించే విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామని, చార్జీలను పెంచబోమని చెప్పి నాలుగేళ్లలో ఏడు సార్లు విద్యుత్ చార్జీలను పెంచిన ఘటన వైసీపీ ప్రభుత్వానిదని వ్యాఖ్యానించింది. వ్యవసాయానికిచ్చే ఉచిత విద్యుత్‌కు మంగళం పలికేందుకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేశారని, రాష్ట్రంలోని కోటి 89 లక్షల మంది వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగింపు పేరుతో రూ.13,500 కోట్లు వృథా ఖర్చు కోసం ప్రజలపై మరోమారు బాదుడుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని దుయ్యబట్టింది. విద్యుత్ వినియోగ శ్లాబులు కుదించి, విద్యుత్ చార్జీలను అనేకసార్లు పెంచడమే కాకుండా విద్యుత్ సర్దుబాటు చార్జీల విధింపు, స్మార్ట్‌మీటర్లతో ప్రజలపై అమాంతం భారం పెంచడం దుర్మార్గమని పేర్కొంది. సీపీఐ రాష్ట్ర సమితి రౌండ్ టేబుల్‌లో రాజకీయ పార్టీలు, రైతు, ప్రజాసంఘాలు, సమాఖ్యల ప్రతినిధులు హాజరవుతారని ప్రకటన తెలిపింది.

రాజీ ప్రసక్తే లేదు

విచారణ కోసమే డబ్ల్యూఎఫ్ఐ కార్యాలయానికి సంగీత: రెజ్లర్లు

న్యూఢిల్లీ: తమ పోరాటంలో రాజీ ప్రసక్తే లేదని రెజ్లర్లు వినేశ్ ఫోగాట్, బజరంగ్ పూనియా తేల్చిచెప్పారు. లైంగిక వేధింపుల కేసులో డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌తో రాజీకి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడి ఇంటి వద్ద సంగీత ఫోగాట్ కనిపించడం దుమారం రేపింది. ఆమెను పోలీసులు విచారణ కోసం డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడి కార్యాలయానికి తీసుకెళ్లారని రెజ్లర్లు స్పష్టంచేశారు. దీనిని ఢిల్లీ పోలీసులూ ధ్రువీకరించారు. బ్రిజ్‌భూషణ్ తన అధికారాన్ని దుర్వినియోగిస్తున్నారని రెజ్లర్లు ఆరోపించారు. 'బ్రిజ్‌భూషణ్ తనకున్న అధికార-కండ- రాజకీయ బలంతో పాటు తప్పుడు ప్రచారాస్త్రంతో రెజ్లర్లను వేధించడంలో నిమగ్నమయ్యారు' అని వినేశ్ ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. బ్రిజ్‌భూషణ్ అరెస్టును మరోమారు డిమాండ్ చేశారు. తమపై విరుచుకుపడటం మానేసి ఆయనను పోలీసులు అరెస్టు చేస్తే న్యాయం జరుగుతుందన్న ఆశ ఉంటుందన్నారు. బ్రిజ్‌భూషణ్ ఇంటికి సంగీత వెళ్లలేదని, అది నేరం జరిగిన స్థలం కాబట్టి మహిళా రెజ్లర్లను దర్యాప్తు కోసం అక్కడికి తీసుకెళ్లారని బజరంగ్ పూనియా కూడా ట్వీట్ చేశారు. కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ సూచనమేరకు ఈనెల15 వరకు తమ ఆందోళనను రెజ్లర్లు వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే.

ఆమెను విచారణకు తీసుకెళ్లాం: ఢిల్లీ పోలీసులు

మహిళా పోలీసు సిబ్బందితో పాటు మహిళా రెజ్లర్‌ను మధ్యాహ్నం 1.30 గంటలకు డబ్ల్యూఎఫ్ఐ కార్యాలయానికి తీసుకెళ్లినట్లు ఢిల్లీ పోలీసు అధికారి తెలిపారు. అరగంట అక్కడే ఉన్నట్లు చెప్పారు. సీన్ రిక్రియేట్ చేసి, వేధింపులు ఎలా, ఎప్పుడు జరిగాయో ఆరా తీసినట్లు వెల్లడించారు. ఇదిలావుంటే రెజ్లర్లపై లైంగిక వేధింపుల వ్యవహారాన్ని ఢిల్లీ సిట్ విచారిస్తోంది. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై ఉన్న రెండు కేసుల్లో దర్యాప్తు నివేదికను వచ్చే వారంలో సమర్పించనున్నది. ఇప్పటికే 180 మందిని సిట్ ప్రశ్నించింది.

శరద్ పవార్‌కు బెదిరింపు

- ధబోల్కర్ గతే అని హెచ్చరిక
- పోలీసులకు ఎన్‌సీపీ ఫిర్యాదు
- సంయమం పాటించాలని కార్యకర్తలకు పార్టీ పిలుపు

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్‌ను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. సామాజిక మాధ్యమంలో పవార్‌కు బెదిరిం పులు వచ్చినట్లు ఎన్‌సీపీ శుక్రవారం తెలిపింది. సంయమనం పాటించాలని, ఎట్టిపరిస్థితుల్లో శాంతికి విఘాతం కలిగించరాదని పార్టీ కార్యకర్తలకు పిలుపుని చ్చింది. పవార్‌కు బెదిరింపు సందేశాన్ని సామాజిక మాధ్యమంలో ఒక వ్యక్తి పంపినట్లు పోలీసులకు ఎన్‌సీపీ ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. పవార్ కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే ముంబై పోలీసు కమిషనర్ వివేక్ ఫన్‌సాల్కర్‌ను కలిశారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నరేంద్ర ధబోల్కర్‌కు పట్టిన గతే పడుతుందని సోషల్ మీడియాలో 82ఏళ్ల పవార్‌కు సందేశం వచ్చినట్లు తెలిపారు. హేతువాది ధబోల్కర్ 2013, ఆగస్టు 20న పూనేలో మార్నింగ్ వాక్‌కు వెళ్లినప్పుడు హత్యకు గురయ్యారు. ఆయనను దుండగులు కాల్చి చంపారు. పవార్‌కు వచ్చిన బెదిరింపు సందేశం స్క్రీన్‌షాట్ల ప్రింటౌట్లను పోలీసులకు సుప్రియా సూలే అందజేశారు. అయితే ఈ బెదిరింపు సౌరవ్ పింపాల్కర్ అనే బీజేపీ మద్దతుదారుడి నుంచి వచ్చినట్లు తెలిసిందని ఎన్‌సీపీ సీనియర్ నేత అజిత్ పవార్ తెలి పారు. భావ ప్రకటన స్వేచ్ఛను దుర్వినియోగిం చకుండా సైద్ధాంతిక పోరాటాన్ని హుందాగా పోరాడాలని విలేకరు లతో మాట్లాడిన ఆయ న్నారు. రాజకీయ నేతలను అప్రతిష్ఠ పాల్జేందుకు, తప్పుడు ప్రచారానికి, సమాజాన్ని విభజించేందుకు సామాజిక మాధ్యమాలు దుర్వినియోగ మవుతున్నాయని అన్నారు. పవార్‌కు ప్రాణహాని ఉన్నట్లు తెలిసి కంగారుపడ్డ కార్యకర్తలు సీనియర్ నేతలకు ఫోన్లు చేసి నాయకుడి భద్రత గురించి ఆరా తీసినట్లు ఎన్‌సీపీ అధికార ప్రతినిధి మహేశ్ తపాసే తెలిపారు. ఎన్‌సీపీ అధ్యక్షుడిని బెదిరించడమంటే లౌకికవాదాన్ని బెదిరించడమే అని అన్నారు. లౌకికవాదం పవార్ ఆత్మని, ఆయన నుంచి లౌకికవాదాన్ని ఎవరూ విడదీయలేరన్నారు. ఇలాంటి బెదిరింపులకు ఆయన బెదరని తపాసే అన్నారు. ఇక నిర్ణయం మహారాష్ట్ర ప్రభుత్వానిదని, లౌకికవాదాన్ని ప్రోత్సహిస్తుందో... రాజ్యాంగాన్ని సమర్థిస్తుందో లేక ధబోల్కర్ హంతకులకు స్వేచ్ఛనిస్తుందో చూడాలని వ్యాఖ్యానించారు.

ఎన్‌సీపీ వర్కర్ల స్వచ్ఛంద అరెస్టులు

శరద్ పవార్... మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ అవతారమని బీజేపీ నేత నీలేశ్ రానే చేసిన ట్వీట్‌పై ఆగ్రహించిన ఎన్‌సీపీ కార్యకర్తలు శుక్రవారం ఆందోళన చేశారు. స్వచ్ఛందంగా అరెస్టు అయ్యారు. ఆజాద్ మైదానానికి చేరుకొన్న కార్యకర్తలను పోలీసులు యల్లో గేట్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు మహేశ్ తపాసే ఒక ప్రకటనలో తెలిపారు. 'మా కార్యకర్తలు పవార్ సాహెబ్ విషయంలో రాజీపడబోరు. ఆయన ప్రతిష్ఠను కాపాడేందుకు వీధుల్లోకి వచ్చి పోరాడతారు. నీలేశ్ రానేపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోదు. ఎందుకంటే దానికి నైతికత లోపించింది. కాబట్టి మేము ఆందోళన నిర్వహించి స్వచ్ఛందంగా అరెస్టయ్యాం' అని తపాసే వెల్లడించారు. ఎన్‌సీపీ ముంబై శాఖ కార్యనిర్వాహక అధ్యక్షుడు నరేంద్ర రానే అధ్వర్యంలో 'ముంబై జైల్ భరో ఆందోళన్' జరిగిందని, పార్టీ అధికార ప్రతినిధి క్లయిడె కాస్ట్రోతో సహా అనేక మంది అరెస్టు అయ్యారని పార్టీ ప్రకటన పేర్కొంది.

అకారణ మార్పులపై సంప్రదించలేదు

ఎన్‌సీఈఆర్టీకి సుహాస్ పల్షికర్, యోగేంద్ర యాదవ్ లేఖ

న్యూఢిల్లీ: హేతుబద్ధీకరణ నెపంతో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులను వ్యతిరేకిస్తూ తొమ్మిది నుంచి 12వ తరగతి రాజకీయ శాస్త్రంలో ప్రధాన సలహాదారులుగా తమ పేర్లను వెంటనే తొలగించాలని యోగేంద్ర యాదవ్, సుహాస్ పల్షికర్ కోరారు. ఈ మేరకు నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్, ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ) డైరెక్టర్ దినేశ్ సక్లానీకి వారు ఓ లేఖ పంపారు. తాజా మార్పుల (తొలగింపులు-కోతలు)తో పాఠ్యపుస్తకాలు గుర్తుపట్టలేని విధంగా తయారయ్యాయని, అకారణ కోతలు, పెద్దఎత్తున తొలగింపులు జరిగాయని, తద్వార ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయలేదని వెల్లడించారు. తాజా మార్పుల గురించి తమకు సమాచారం లేదని, కనీసం సంప్రదించనూ లేదని పేర్కొన్నారు. కోతలు, తొలగింపుల గురించి మిగిలిన నిపుణులను సంప్రదిస్తేగనుక వారితో తాము ఏకీభవించడం లేదన్నారు. హేతుబద్ధీకరణ ప్రక్రియ వివక్షభరితంగా సాగిందని, తొలగింపుల వెనుక ఎలాంటి లాజిక్ లేదని, పాలకుల మెప్పు కోసమే జరిగిందన్నారు. తమ విజ్ఞప్తిమేరకు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని, పాఠ్యపుస్తకాలలో తమ పేర్లను వాడుకోవద్దని ఎన్‌సీఈఆర్టీని సుహాస్ పల్షికర్, యోగేంద్ర యాదవ్ కోరారు. హేతుబద్ధీకరణ ప్రక్రియ బెడిసికొట్టిందని పాఠ్యపుస్తకాలు గుర్తించలేని విధంగా మారిపోయిందని, అవి బోధనకు అనర్హమని వ్యాఖ్యానించారు. 2006-07లో ప్రచురితమైన ఆరు పుస్తకాల్లో ప్రధాన సలహాదారులుగా తమ పేర్లు ఉన్నాయని, తాజా మార్పులు జరిగిన అనంతరం ప్రచురితమయ్యే పుస్తకాల్లో వాటిని తొలగించాలని కోరారు. నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్) ప్రకారం సిలబస్ నిర్ణయించేందుకు 2005లో ఏర్పాటైన పాఠ్యపుస్తకాలను రూపొందించే కమిటీలో వీరిద్దరు సభ్యులుగా ఉన్నారు. 'మేమిద్దరం 9,10,11, 12వ తరగతి రాజకీయ శాస్త్ర పాఠ్యపుస్తకాలతో ముడిపడి ఉండాలని కోరుకోవడంలేదు కాబట్టి మా పేర్లను ప్రధాన సలహాదారులుగా తొలగించండి. అదే విధంగా ప్రతి పాఠ్యపుస్తకం ఆరంభంలో పాఠ్య పుస్తకాలను రూపొందించే కమిటీ జాబితానూ తొలగించండి' అని కోరుతూ రాసిన లేఖను వారు శుక్రవారం ట్వీట్ చేశారు. తమ పేర్లు ప్రధాన సలహాదారులుగా ఉండటం అవమానంగా ఉందని కూడా పల్షికర్, యాదవ్ పేర్కొన్నారు.

రాముడిని అలా చూపిస్తారా?

'ఆదిపురుష్'పై సినీనటి కస్తూరి విమర్శలు

హైదరాబాద్: ప్రభాస్, కృతి సనన్ జంటగా 'ఆదిపురుష్' చిత్రం తెరకెక్కిన సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ చిత్రంపై ఎన్నో అంచనాలు ఉన్నాయి. మరోవైపు ఈ చిత్రంలో రాముడి పాత్రను పోషించిన ప్రభాస్ రూపంపై సినీ నటి కస్తూరి విమర్శలు చేశారు. ప్రభాస్ లుక్ చూస్తుంటే ఆయన రాముడిలా లేరని, కర్ణుడిలా ఉన్నారని అన్నారు. రాముడిని, లక్ష్మణుడిని మీసాలతో చూపించడం ఏమిటని ప్రశ్నించారు. తెలుగు సినిమాల్లో ఎంతో మంది నటులు రాముడి పాత్రల్లో తెరపై ఎంతో అందంగా కనిపించారని... కానీ ప్రభాస్ మాత్రం కర్ణుడిలా కనిపిస్తున్నారని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ప్రభాస్ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. ఇదే సమయంలో కొందరు ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తున్నారు.

హైదరాబాద్‌లో పవన్ 'ఓజీ' మూడో షెడ్యూల్



హైదరాబాద్: టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. ఈ స్టార్ యాక్టర్ సుజిత్ డైరెక్షన్‌లో టైటిల్ రోల్ పోషిస్తున్న మూవీ ఓజీ. ప్రస్తుతం హైదరాబాద్‌లో మూడో షెడ్యూల్ కొనసాగుతోంది. కాగా పవన్ కల్యాణ్ తాజాగా షూటింగ్‌లో చేరిపోయాడు. ప్రస్తుతం మాస్, ఎనర్జిటిక్ యాక్షన్ షెడ్యూల్ కొనసాగుతోంది. పవన్ కల్యాణ్ సెట్స్‌లోకి వచ్చాడన్న వార్తను అభిమానులు ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తున్న ఓజీలో గ్యాంగ్‌లీడర్ ఫేం ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోఇన్‌గా నటిస్తోంది. కొన్ని రోజుల క్రితం ఓజీ ముంబై, పూనే షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది ఓజీ. పవన్ కల్యాణ్ మరోవైపు బ్రో చిత్రంలో కూడా నటిస్తున్నాడు. బ్రో ఇటీవలే డబ్బింగ్ కార్యక్రమాలు కూడా పూర్తి చేసుకుంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ కూడా షూటింగ్ దశలో ఉంది. ఇప్పటికే విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ వీడియో నెట్టింట్లో ట్రెండింగ్ అవుతోంది. మరోవైపు క్రిష్ దర్శకత్వం వహిస్తున్న హరిహరవీరమల్లులో కూడా పవన్ నటిస్తున్నాడు.

కేరళలో భారీ మొత్తానికి 'జైలర్' పంపిణీ హక్కులు

చెన్నై: నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తోన్న తాజా చిత్రం జైలర్ సినిమా పంపిణీ హక్కులు కేరళలో భారీ మొత్తానికి అమ్ముడైనట్లు సమాచారం. కేరళలో జైలర్ పంపిణీ హక్కులు రూ.5.5 కోట్లు పలికినట్టు తెలుస్తోంది. శ్రీ గోకులం మూవీస్ జైలర్ చిత్రాన్ని కేరళలో విడుదల చేస్తోంది. కేరళలో తలైవా క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో ఈ ఒక్క అప్‌డేట్‌తో అర్థం చేసుకోవచ్చు. జైలర్‌లో మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్, టాలీవుడ్ యాక్టర్ సునీల్, తమన్నా, కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్, రమ్యకృష్ణ, యోగిబాబు, వసంత్ రవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలే జైలర్ షూటింగ్ పూర్తయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. జైలర్ ఆగస్టు 10న థియేటర్లలో సందడి చేయనుంది. జైలర్ నుంచి ఇప్పటికే విడుదల చేసిన మోహన్ లాల్, సునీల్, తమన్నా పోస్టర్లు ఈ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందించారు. జైలర్ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్నారు. రజినీకాంత్ మరోవైపు జై భీమ్ ఫేం టీజే జ్ఞానవేళ్ దర్శకత్వంలో తలైవా 170 కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడన్న సంగతి విదితమే.

పట్టు బిగించిన ఆసీస్

- 175 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం
- భారత్ మొదటి ఇన్నింగ్స్: 296 ఆలౌట్
- అర్ధ సెంచరీలతో ఆదుకున్న రహానే, శార్దూల్

లండన్: ఇక్కడి కెన్నింగ్టన్ ఓవల్ మైదానంలో జరుగుతున్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూ టీసీ) ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు పట్టు బిగించింది. భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 296 పరుగులకే కట్టడి చేసి 175 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సంపాదించింది. రెండో ఇన్నింగ్స్‌లో కడపటి వార్తలందేసరికి మూడు వికెట్లు నష్టపోయి 90 పరుగులు సాధించింది. మూడోరోజు శుక్రవారం ఉదయం ఆట ప్రారంభం కాగానే రెండో బంతికే బోలాండ్ బౌలింగ్‌లో కేఎస్ భరత్ బౌల్డ్ అయ్యాడు. కానీ ఆ తర్వాత రహానే, శార్దూల్ చేసిన పోరాటం అనిర్వచనీయం. కమ్మిన్స్, బోలాండ్, స్టార్క్ లాంటి పేస్ అటాక్‌ను ఆ ఇద్దరూ సమర్థంగా ఆడేశారు. వేగవంతమైన బంతులతో ఆ బౌలర్లు హడలె త్తిస్తున్నా... రహానే, శార్దూల్ మాత్రం స్కోర్ పెంచుతూ పోరాట స్ఫూర్తిని చాటారు. టీమిండి యాను ఫాల్‌ఆన్ గండం నుంచి గట్టెక్కిం చారు. కాగా భోజన విరామ సమయం అనంతరం రెండో సెషన్ ప్రారంభమైన వెంటనే టీమిండియా రెండో ఓవర్‌లో 7వ వికెట్ కోల్పోయింది. 61.6 ఓవర్ వద్ద అజింక్య రహానే కమిన్స్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అజింక్య రహానే సెంచరీ పూర్తి చేస్తాడనుకున్న అభిమానుల ఆశలపై ఆస్ట్రేలియా బౌలర్ కమిన్స్ నీళ్లు చల్లాడు. కమిన్స్ వేసిన బౌలింగ్‌లో కామెరూన్ గ్రీన్ క్యాచ్ పట్టుకోవడంతో రహానే వెనుదిరిగాడు. అప్పటికీ జట్టు స్కోర్ 270 పరుగులు దాటడంతో ఫాలోఆన్ గండం తప్పింది. మరోవైపు అర్ధ సెంచరీతో శార్దూల్ ఠాకూర్ భారత్‌ను ఆదుకు న్నాడు. అయితే మరి కొద్దిసేపటిలోనే మరో మూడు వికెట్లను కోల్పోయి టీమిం డియా ఆలౌట్ అయింది. రహానే స్థానంలో క్రీజులోకి వచ్చి ఉమేశ్ యాదవ్(5)ను కమిన్స్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత శార్దూల్ (51) గ్రీన్ బౌలింగ్‌లో అలెక్స్ క్యారీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. చివరిగా మహ్మద్ షమీ ఔట్ కావడంతో భారత్ ఆలౌట్ అయింది. ఆసీస్ బౌలర్ స్టార్క్ బౌలింగ్‌లో అలెక్స్ కారీకి క్యాచ్ ఇచ్చి మహ్మద్ షమీ వెనుదిరిగాడు. మహ్మద్ షమీ 11 బంతుల్లో 13 పరుగులు చేశాడు. సిరాజ్ నాటౌట్‌గా మిగిలిపోయాడు.

గాయంతోనే పోరాడిన రహానే

తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా టాప్ ఆర్డర్ విఫలమైనా... స్టార్ బ్యాటర్ అజింక్య రహానె అద్భుతంగా పోరాడాడు. 71 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన జట్టును రహానే అసాధారణ బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. ముందుగా రవీంద్ర జడేజా(48)తో కలిసి ఐదో వికెట్‌కు 71 పరుగుల భాగస్వా మ్యా న్ని నమోదు చేసిన రహానే... రెండో రోజు శ్రీకర్ భరత్ ఔటైనా తన వంతు కృషి చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో రెండో రోజు బ్యాటింగ్ చేస్తుండగా రహానే చేతి వేలికి గాయమైంది. ఆ వేలికి బ్యాండేజ్ వేసుకొని బ్యాటింగ్ చేసిన రహానె... మూడో రోజు కూడా నొప్పిని భరిస్తూనే బ్యాటింగ్ చేశాడు. మరోసారి బంతి గాయంపైనే తాకడంతో నొప్పితో విలవిలలాడాడు. ఫిజియోవచ్చి ప్రథమ చికిత్స చేయగా... రహానె మొండిగా బ్యాటింగ్ చేశాడు. ఈ క్రమంలో టెస్ట్ ఫార్మాట్లో 5000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ ఘనత సాధించిన 13వ భారత బ్యాటర్‌గా చరిత్రకెక్కా డు. 141 ఇన్నింగ్స్‌లో రహానే... 26 అర్ధ సెంచరీలు, 12 శతకాలు నమోదు చేశాడు.

తొలిరోజే గందరగోళం

- జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ నిర్వహణ అస్తవ్యస్తం
- గెలిచిన బాక్సర్‌ను ఓడినట్టు ప్రకటించిన వైనం
- పోటీలను బహిష్కరించిన ఎన్టీఆర్ జిల్లా బాక్సర్లు

విశాలాంధ్ర-వియవాడ (స్పోర్ట్స్): విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాల ఆవరణలో శుక్రవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ తొలి రోజునే తీవ్ర ఆరోపణలకు ఎదుర్కొంది. పోటీల నిర్వహణ పూర్తిగా లోపభూయిష్టంగా ఉండటంతోపాటు గెలిచిన బాక్సర్లను ఓడినట్టుగా ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశమైంది. అదే విషయంపై పోటీల కార్యనిర్వాహక కార్యదర్శితోపాటు ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేసినా కనీసం విచారణ కూడా చేపట్టకపోవడంతో ఎన్టీఆర్ జిల్లా బాక్సర్లు పోటీలను బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. దీనికితోడు విశాఖపట్నం జిల్లాకు చెందిన బాక్సర్లను శ్రీకాకుళం, విజయనగరం, నెల్లూరు, కర్నూలు జిల్లాలకు ఆడించడం కూడా విమర్శలకు తావిచ్చింది. ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ రెండు గ్రూపులుగా విడిపోవడంతోపాటు సంఘంపై ఆధిపత్యం కోసం రెండు వర్గాలు కోర్టును ఆశ్రయించాయి. ఒకవైపు కోర్టు కేసు ఉన్నప్పటికీ, ఒక వర్గం విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజీలో రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌ను నిర్వహించడం గమనార్హం. ఇదిలావుండగా, ఈ పోటీలకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) నుంచి కనీసం పరిశీలకులు కూడా హాజరుకాలేదు. కాగా, తొలి రోజున ఏడో బౌట్‌లో శ్రీకాకుళం - ఎన్టీఆర్ జిల్లాల బాక్సర్ల మధ్య పోటీ జరిగింది. ఈ పోటీలో ఎన్టీఆర్ జిల్లా బాక్సర్ వి మురళీ గెలుపొందగా, నిర్వాహకులు శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాజ్ నవదీప్ గెలుపొందినట్టుగా ప్రటించారు. వాస్తవానికి రాజ్ నవదీప్ విశాఖపట్నం జిల్లాకు చెందిన బాక్సర్ అని, అతను అధిక బరువు కలిగి ఉన్నట్లు ఎన్టీఆర్ జిల్లా బాక్సర్లు రాష్ట్ర సంఘానికి, పోటీల నిర్వాహక కమిటీకి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఆర్‌కె పురుషోత్తం సమక్షంలోనే ఈ ఘటన జరిగినా ఎవరూ స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంఘంలోని ప్రతినిధుల మధ్య ఉన్న ఆధిపత్య పోరును, క్రీడాకారులపై రుద్దడం ఎంత వరకు సమంజసమని క్రీడాకారులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై శాప్ అధికారులతోపాటు ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని బాధిత బాక్సర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తెలిపారు. తమ ఫిర్యాదును కనీసం పరిగణనలోకి తీసుకోకపోవడంతో పోటీలను బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర సంఘానికి సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎంవీఎస్ ప్రసాద్ తెలిపారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన క్రీడాకారులను ఇతర జిల్లాల తరపున ఆడించడం చట్టరీత్యా నేరమని, ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఆసీస్ ఆటగాళ్లు బాల్ టాంపరింగ్ చేశారు: బాసిత్ అలీ ఆరోపణ

ఇస్లామాబాద్: భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌లో బాల్ టాంపరింగ్ కలకలం రేగింది. టీమిండియా కీలక ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, ఛతేశ్వర్ పుజారాలను అవుట్ చేసేందుకు ఆసీస్ బాల్ టాంపరింగ్ కు పాల్పడిందని పాకిస్తాన్ మాజీ ఆటగాడు బాసిత్ అలీ సంచలన ఆరోపణలు చేశాడు. మైదానంలోని ఆసీస్ ఆటగాళ్లు ఉద్దేశపూర్వకంగానే బాల్ ఆకారాన్ని మార్చేశారని బాసిత్ అలీ తన యూట్యూబ్ చానల్లో వెల్లడించాడు. ఆసీస్ బాల్ టాంపరింగ్ టీవీలో స్పష్టంగా కనిపించిందని, కానీ మైదానంలో ఉన్న అంపైర్లకు, కామెంటరీ బాక్స్ లో ఉన్నవారికి మాత్రం అది కనిపించలేదని వ్యాఖ్యానించాడు. ఆసీస్ ఆటగాళ్లు 16, 18వ ఓవర్లలో బాల్ టాంపరింగ్ చేయడం కనిపించిందని బాసిత్ అలీ వివరించాడు. 18వ ఓవర్ సమయంలో బంతి ఆకారం దెబ్బతిన్నదంటూ మరో బంతిని తీసుకున్నారని వెల్లడించాడు. ఆసీస్ బాల్ టాంపరింగ్‌కు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని వెల్లడించాడు. కాగా, ఈ మ్యాచ్ లో పుజారా 14వ ఓవర్ లో అవుట్ కాగా, కోహ్లీ 19వ ఓవర్ లో అవుటయ్యాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.